**విలేకరులు కావలెను**

**పెన్ సత్తా తెలుగు దినపత్రిక**

ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లా లకి పెన్ సత్తా దినపత్రికలో పనిచేయుటకు జిల్లా స్టాప్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జ్ లు, మండల రిపోర్టర్లు కావలెను. వార్తలు పెట్టే వారికే ప్రాధాన్యత.

ఫోన్ నెం : 9885315759

RNI:APTEL/2023/87729

# పెన్ సత్తా

ప్రశ్నించడం అందిరి హక్కు..

PEN SATTA Telugu Daily






సంపుటి : 4 | సంచిక :173 | ఎడిటర్ : చింతమనేని అనిల్ కుమార్ | ఆదివారం 8 నవంబర్ 2026 | పేజీలు : 08 | వెల : 03

Published from Vishakapatnam Circulated by Vijayawada, Ongole, Chittoor, Kadapa, Tirupati. Nandyal, Hyderabad, Ananthapur, Kurnool








## తుపాను బాధితులకు
# తక్షణ ఊరట

- మురసు తుపాను నష్టంపై సీఎం సమీక్ష
- రేపటిలోగా నిత్యావసరాల పంపిణీ పూర్తి చేయాలి!
- ఈ నెల 9లోగా పంట నష్టం అంచనాలు పూర్తి చేయాలి..
- 92 శాతం ఉద్యాన పంటల నష్టం అంచనాలు పూర్తి..
- 3.82 లక్షల కుటుంబాలకు నిత్యావసరాల పంపిణీ




**అమరావతి**

మురసు తుపాను ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలు, విద్యుత్ పునరుద్ధరణ, పంట నష్టం అంచనాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష నిర్వహించారు. శనివారం క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, రెవెన్యూ, విద్యుత్, వ్యవసాయం, పౌరసరఫరాల శాఖల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. తుపాను బాధితులకు నిత్యావసర సరకుల పంపిణీని ఆదివారం నాటికి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. పంట నష్టం అంచనాలను త్వరితగతిన పూర్తి చేసి, బాధిత రైతులకు తక్షణ సాయం అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. మురసు తుపాను కారణంగా దెబ్బతిన్న ఉద్యాన పంటలకు సంబంధించి ఇప్పటివరకు 92 శాతం నష్టం అంచనాలు పూర్తయ్యాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. వ్యవసాయ పంటల నష్టం అంచనాలను ఈ నెల 9వ తేదీలోగా పూర్తి చేస్తామని తెలిపారు. నష్టం వివరాల నమోదు, వివరాలు 2లో..




## దక్షిణాదికి బుల్లెట్
# రైలు కానుక

- బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు 2 గంటల 10 నిమిషాలే!
- బెంగళూరు--చెన్నై మధ్య 73 నిమిషాలే
- ఏడు హైస్పీడ్ కారిడార్లకు కేంద్రం ప్రతిపాదన
- హైదరాబాద్--చెన్నై మధ్య 2 గంటల 55 నిమిషాలు
- రూ.16 లక్షల కోట్ల పెట్టుబడుల అంచనా
- 4 వేల కిలోమీటర్ల మేర హైస్పీడ్ నెట్‌వర్క్
- ఐటీ, వాణిజ్య, పారిశ్రామిక రంగాలకు భారీ ప్రయోజనం

## గాంధీ, నెహ్రూల స్థాయి మోదీకి ఎప్పటికీ రాదు!

- ప్రధాని మోదీపై అభిజీత్ దీప్కే తీవ్ర విమర్శలు..
- 120 ఏళ్లు అధికారంలో ఉన్నా ఆ మహానేతలతో పోలిక సాధ్యం కాదు..
- ఎస్ఐఆర్‌పై పోరాటం ఆగదని స్పష్టీకరణ



## ప్రజాస్వామ్యానికి బీజేపీ తీవ్ర నష్టం చేసింది..



- వ్యవస్థల పునరుద్ధరణకు సమష్టి కృషి అవసరం: సోనియా గాంధీ
- మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత విమర్శలు..
- ఎన్నికల్లో అక్రమాలు జరిగాయంటూ ఆరోపణలు..
- ఆత్మకథలో రాజీవ్‌తో అనుబంధం, రాజకీయ ప్రయాణం

ఎమర్జెన్సీపై కీలక వ్యాఖ్యలు..

## మేం ఓడినా.. ప్రజల మనసులు గెలుచుకున్నాం

చంద్రబాబు గెలిచి నైతికంగా ఓడిపోయారు..

ఎన్నికల్లో అధికార దుర్వినియోగం జరిగిందని ఆరోపణ..

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తాం



**తాడేపల్లి**

స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమి అక్రమాలకు పాల్పడిందని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించారు. నామినేషన్ల దశ నుంచి పోలింగ్, ఓట్ల లెక్కింపు వరకు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని విమర్శించారు. చంద్రబాబు ఎన్నికల్లో గెలిచినా నైతికంగా ఓడిపోయారని, తాము ఓటమి పాలైనా ప్రజల మనసులను గెలుచుకున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ ఆయన సోషల్ మీడియాలో పోస్టు చేశారు. మున్సిపల్ ఎన్నికల కౌంటింగ్ తరహాలోనే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపులోనూ అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చారని జగన్ ఆరోపించారు. పలు జిల్లాల్లో ఫలితాలను అడ్డగోలుగా తారుమారు చేస్తున్నారని విమర్శించారు. నామినేషన్ల నుంచి పోలింగ్ వరకు చోటుచేసుకున్న పరిణామాలు వివరాలు 2లో..



## చైనా క్షిపణులకు చెక్ పెట్టేందుకు అమెరికా మాస్టర్‌ప్లాన్

- రెండో ప్రపంచ యుద్ధం నాటి ఎయిర్‌బేస్‌లకు మళ్లీ కళ!
- పసిఫిక్‌లో నాలుగు ఎయిర్‌ఫీల్డ్‌ల విస్తరణకు అమెరికా ప్రతిపాదన
- రెండో ప్రపంచ యుద్ధం నాటి టినియన్ ఎయిర్‌బేస్ కూడా జాబితాలో
- ఏడాదికి 6,080 విమాన కార్యకలాపాలు నిర్వహించే అవకాశం
- ఒక్కో ప్రాంతంలో వెయ్యి మంది సైనికులతో విన్యాసాలు
- చైనా క్షిపణి దాడుల ముప్పును ఎదుర్కొనేందుకు ఏసీఈ వ్యూహం

## ఏపీ పరిషత్ పోరులో కూటమి
# క్లీన్ స్వీప్!

- ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో టీడీపీ కూటమి ఘన విజయం
- జడ్పీటీసీల్లో 273.. ఎంపీటీసీల్లో 5,597 స్థానాలు కైవసం
- వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ.. టీడీపీదే పైచేయి



**అమరావతి**

ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో అధికార తెలుగుదేశం పార్టీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించింది. గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి తన ఆధిపత్యాన్ని చాటుకుంది. తెలుగుదేశం పార్టీ, జనసేన, బీజేపీ కలిసి అత్యధిక స్థానాలను కైవసం చేసుకోగా.. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వెనుకబడింది. శనివారం ఉదయం 8 గంటలకు రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన ఓట్ల లెక్కింపు రాత్రి వరకు కొనసాగింది. రాత్రి 9 గంటల సమయానికి రాష్ట్ర ఎన్నికల సంఘం వెల్లడించిన గణాంకాల ప్రకారం కూటమి పార్టీలు కలిపి 273 జడ్పీటీసీ, వివరాలు 2లో..

## చమురు శుద్ధిలో భారత్ దూకుడు

- అమెరికా, యూరప్‌పై వ్యూహాత్మక ఆధిక్యం
- చమురు శుద్ధి సామర్థ్యంలో భారత్‌కు ప్రపంచంలో నాలుగో స్థానం
- ఏడాదికి 267.1 మిలియన్ టన్నుల ప్రస్తుత సామర్థ్యం
- 2030 నాటికి 300 మిలియన్ టన్నుల లక్ష్యం
- ముడి చమురు అవసరాల్లో 88 శాతం దిగుమతులపైనే ఆధారం
- ఆరు నెలల్లో పెట్రోలియం ఎగుమతుల విలువ 27.2 బిలియన్ డాలర్లు



# తుపాను బాధితులకు తక్షణ ఊరట

-మొదటిపేజీ తరువాయి

క్షేత్రస్థాయి పరిశీలనలో ఎలాంటి జాప్యం జరగకుండా చూడాలని సీఎం ఆదేశించారు.

**1,825 గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు**


తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులపై చంద్రబాబు ఆరా తీశారు. మురసు తుపాను ప్రభావంతో 1,825 గ్రామాల్లో విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 7,850 దెబ్బతిన్న విద్యుత్ స్తంభాలను మరమ్మతు చేసినట్లు వివరించారు. గతంలో వచ్చిన అర్నబ్ తుపాను కారణంగా సుమారు 30 వేల విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయని, ప్రస్తుతం అన్ని గ్రామాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించినట్లు వెల్లడించారు.

**3.82 లక్షల కుటుంబాలకు నిత్యావసర సరకులు**

తుపాను బాధిత కుటుంబాలకు నిత్యావసర సరకుల పంపిణీ కొనసాగుతోందని పౌరసరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ఇప్పటివరకు 3.82 లక్షల కుటుంబాలకు సరకులు అందించినట్లు వెల్లడించారు. మిగిలిన కుటుంబాలకు ఆదివారం నాటికి పంపిణీ పూర్తి చేస్తామని ముఖ్యమంత్రికి హామీ ఇచ్చారు. పంపిణీ ప్రక్రియను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని చంద్రబాబు ఆదేశించారు.

**రైతుబజార్లలో కిలో ఉల్లిపాయలు రూ.35**

బహిరంగ మార్కెట్‌లో నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలపై సీఎం సమీక్షించారు. ఉల్లిపాయలు, బియ్యం, పామాయిల్,



కందిపప్పు, గోధుమ పిండి ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. రైతుబజార్ల ద్వారా కిలో ఉల్లిపాయలను రూ.35కే విక్రయిస్తున్నామని అధికారులు తెలిపారు. ఇందుకోసం 8 వేల క్వింటాళ్ల ఉల్లిపాయలను మార్కెట్‌లోకి తీసుకొచ్చినట్లు వివరించారు.

**బియ్యం ధరల నియంత్రణకు చర్యలు**

బియ్యం ధరలను నియంత్రించేందుకు మిల్లర్లు, హోల్‌సేల్ వ్యాపారులతో చర్చలు జరిపినట్లు అధికారులు వెల్లడించారు. వివిధ రకాల బియ్యాన్ని నిర్ణీత ధరలకు విక్రయించేందుకు వ్యాపారులు అంగీకరించినట్లు తెలిపారు. బీపీటీ సోనా, సాంబ, కేఎన్ఎం రకాల బియ్యాన్ని కిలో రూ.66కు, హెచ్ఎంటీ, ఆర్ఎన్ఆర్ రకాలను రూ.76కు, జై శ్రీరామ్ రకాన్ని రూ.82కు, సాధారణ రకం బియ్యాన్ని రూ.47కు విక్రయించేందుకు అంగీకరించినట్లు వివరించారు. ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించిన 204 మంది వ్యాపారులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు.

**రైతుబజార్లలో ధరణి బియ్యం కిలో రూ.50**

ధరణి బ్రాండ్ బియ్యాన్ని రైతుబజార్లలో అందుబాటులోకి తీసుకొచ్చినట్లు అధికారులు తెలిపారు. బహిరంగ మార్కెట్‌లో కిలో రూ.70 పలుకుతున్న బియ్యాన్ని రైతుబజార్లలో రూ.50కే విక్రయిస్తున్నామని చెప్పారు. బీపీటీ రకం బియ్యాన్ని కిలో రూ.49కు అందిస్తున్నట్లు వివరించారు. ఇప్పటివరకు 150 కౌంటర్ల ద్వారా 27,430 క్వింటాళ్ల బియ్యాన్ని విక్రయించగా, 1.03 లక్షల కుటుంబాలు కొనుగోలు చేసినట్లు వెల్లడించారు.

**రేషన్ దుకాణాల్లో తక్కువ ధరలకు నిత్యావసరాలు**

సామాన్యులకు తక్కువ ధరలకు నిత్యావసర వస్తువులు అందించేందుకు రేషన్ దుకాణాల ద్వారా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. లీటరు పామాయిల్‌ను రూ.125కు, కిలో కందిపప్పును రూ.100కు, కిలో గోధుమ పిండిని రూ.25కు అందించనున్నట్లు వివరించారు. ధరల నియంత్రణ చర్యలు నిరంతరం కొనసాగించాలని, తుపాను బాధితులకు సహాయక చర్యల్లో ఎలాంటి లోటుపాట్లు లేకుండా చూడాలని చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ఏపీ పరిషత్ పోరులో కూటమి క్లీన్‌స్వీప్!

-మొదటిపేజీ తరువాయి

5,597 ఎంపీటీసీ స్థానాలను గెలుచుకున్నాయి. ఇందులో టీడీపీ అత్యధిక స్థానాలతో అగ్రస్థానంలో నిలిచింది.

**జడ్పీటీసీల్లో టీడీపీ హవా**

జడ్పీటీసీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ అత్యధిక స్థానాలను కైవసం చేసుకుంది. రాత్రి 9 గంటల వరకు అందిన ఫలితాల ప్రకారం టీడీపీ 229 స్థానాల్లో విజయం సాధించింది. జనసేన 36, బీజేపీ 8 స్థానాలను దక్కించుకున్నాయి. వైసీపీ 20 స్థానాలకే పరిమితమైంది. ఒక స్థానంలో స్వతంత్ర అభ్యర్థి విజయం సాధించారు. దీంతో జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శించింది.

**ఎంపీటీసీల్లోనూ కూటమిదే పైచేయి**

మండల పరిషత్ ఎన్నికల్లోనూ కూటమి పార్టీలకు భారీ ఆధిక్యం లభించింది. టీడీపీ 4,823 స్థానాలను గెలుచుకోగా, జనసేన 644, బీజేపీ 130 స్థానాలను కైవసం చేసుకున్నాయి. వైసీపీ 1,050 స్థానాలతో వెనుకబడింది. ఇతరులు, స్వతంత్రులు కలిపి కొన్ని స్థానాల్లో విజయం సాధించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన స్థానాలు కూడా పార్టీల మొత్తం విజయాల గణాంకాల్లో భాగంగా ఉన్నాయి.

**70.72 శాతం పోలింగ్ నమోదు**

రాష్ట్రవ్యాప్తంగా ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు ఈ నెల 5న పోలింగ్ నిర్వహించారు. కొన్ని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఈ నెల 6న పోలింగ్ చేపట్టారు. రాష్ట్రంలో మొత్తం 2.61 కోట్లకు పైగా ఓటర్లు ఉండగా, సుమారు 1.85 కోట్ల మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. మొత్తంగా 70.72 శాతం పోలింగ్ నమోదైంది. 2021లో జరిగిన గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి పోలింగ్ శాతం గణనీయంగా పెరిగింది. విశాఖపట్నం జిల్లాలో అత్యధికంగా 82.51 శాతం పోలింగ్ నమోదు కాగా, అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యల్పంగా 62.01 శాతం నమోదైంది.

**ఏకగ్రీవాలతో కలిపి భారీ ఆధిక్యం**

రాష్ట్రంలో మొత్తం 659 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికల ప్రక్రియ చేపట్టగా, 77 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన స్థానాలకు ఎన్నికలు నిర్వహించారు. అదేవిధంగా 9,821 ఎంపీటీసీ స్థానాల్లో 2,051 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మూడు స్థానాలకు నామినేషన్లు దాఖలు కాలేదు. మిగిలిన 7,767 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఏకగ్రీవాలు, పోలింగ్ ద్వారా వచ్చిన విజయాలతో కూటమి తన బలాన్ని మరింత



పెంచుకుంది.

**365 కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు**

రాష్ట్రవ్యాప్తంగా 28 జిల్లాల్లో 365 కేంద్రాలను ఏర్పాటు చేసి ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఇందుకోసం 9,062 కౌంటింగ్ టేబుళ్లను ఏర్పాటు చేశారు. 11,002 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్లు, 28,692 మంది సహాయక సిబ్బందిని నియమించారు. పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపుతో ప్రక్రియ ప్రారంభమైంది. ఎంపీటీసీ ఎన్నికలకు గులాబీ రంగు బ్యాలెట్ పత్రాలు, జడ్పీటీసీ ఎన్నికలకు తెలుపు రంగు బ్యాలెట్ పత్రాలను వినియోగించారు.

కౌంటింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 19,885 మంది పోలీసులతో మూడంచెల భద్రత ఏర్పాటు చేశారు. సున్నితమైన ప్రాంతాల్లో సీసీటీవీ కెమెరాలు, డ్రోన్లు, బాడీ కెమెరాలతో పర్యవేక్షణ చేపట్టారు.

**వైసీపీ అభ్యంతరాలు.. అక్రమాలపై ఆరోపణలు**

ఎన్నికల నిర్వహణలో అధికార యంత్రాంగాన్ని కూటమి ప్రభుత్వం దుర్వినియోగం చేసిందని వైసీపీ ఆరోపించింది. తమ పార్టీ కార్యకర్తలు, పోలింగ్ ఏజెంట్లను ఇబ్బందులకు గురిచేశారని, కొన్ని ప్రాంతాల్లో అక్రమాలు జరిగినా అధికారులు పట్టించుకోలేదని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి విమర్శించారు. అక్రమాలు జరిగిన ప్రాంతాల్లో తిరిగి పోలింగ్ నిర్వహించాలని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే ఓట్ల లెక్కింపు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం పర్యవేక్షించింది.

**గ్రామీణ రాజకీయాల్లో కూటమికి బలం**


మున్సిపల్ ఎన్నికల్లోనూ ఆధిక్యం సాధించిన కూటమి, ఇప్పుడు ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లోనూ మెరుగైన ఫలితాలు సాధించడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. గ్రామీణ ప్రాంతాల్లోనూ కూటమి పట్టు పెరిగిందనే సంకేతాలు ఈ ఫలితాల ద్వారా వెలువడ్డాయి. మరోవైపు వైసీపీకి వచ్చిన ఫలితాలు ఆ పార్టీకి రాజకీయంగా సవాలుగా మారాయి. రానున్న స్థానిక సంస్థల రాజకీయాల్లో ఈ ఫలితాలు ఎలాంటి ప్రభావం చూపుతాయన్నది ఆసక్తికరంగా మారింది.

# దక్షిణాదికి బుల్లెట్ రైలు కానుక

**న్యూఢిల్లీ:** దక్షిణ భారతదేశంలో రైల్వే ప్రయాణ ముఖచిత్రం మారనుంది. ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించేలా హైస్పీడ్ రైలు కారిడార్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా బెంగళూరు, హైదరాబాద్, అమరావతి, చెన్నై నగరాలను అనుసంధానించే దక్షిణాది బుల్లెట్ రైలు కారిడార్‌కు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆమోదం తెలిపినట్లు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. నవంబర్ 1న బెంగళూరు--ముంబై వందే భారత్ స్లీపర్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వివరాలు ప్రకటించారు. ఈ హైస్పీడ్ రైలు కారిడార్ అందుబాటులోకి వస్తే బెంగళూరు--హైదరాబాద్ మధ్య ప్రయాణ సమయం సుమారు 2 గంటల 10 నిమిషాలకు తగ్గనుంది. బెంగళూరు--చెన్నై మధ్య ప్రయాణానికి కేవలం 73 నిమిషాలే పట్టనుంది. దీంతో ఐటీ, పారిశ్రామిక, వాణిజ్య రంగాల్లో కీలకంగా ఉన్న ఈ నగరాల మధ్య రాకపోకలు మరింత వేగవంతం కానున్నాయి. అయితే ప్రాజెక్టు నిర్మాణం, తుది మార్గం, స్టేషన్లు, పనుల ప్రారంభం, పూర్తయ్యే తేదీలపై మరిన్ని అధికారిక వివరాలు వెలువడాల్సి ఉంది.

**దక్షిణాదిలో హైస్పీడ్ రైలు నెట్‌వర్క్**

బెంగళూరు, హైదరాబాద్, చెన్నై వంటి ప్రధాన నగరాలను అనుసంధానించడం ద్వారా దక్షిణ భారతదేశంలో సమగ్ర ఆర్థిక ప్రాంతం అభివృద్ధి చెందుతుందని కేంద్రం భావిస్తోంది. ఈ నగరాల మధ్య వేగవంతమైన రవాణా సదుపాయాలు ఏర్పడితే ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, పారిశ్రామికవేత్తలు, పర్యాటకులకు ఎంతో ప్రయోజనం కలగనుంది. ముఖ్యంగా హైదరాబాద్, బెంగళూరు మధ్య ఐటీ, స్టార్టప్, ఫార్మా, కార్పొరేట్ రంగాల్లో ఇప్పటికే ఉన్న వ్యాపార సంబంధాలు మరింత బలోపేతం కానున్నాయి. చెన్నైలోని ఆటోమొబైల్, తయారీ పరిశ్రమలకు బెంగళూరులోని సాంకేతిక, కార్పొరేట్ రంగాలతో వేగవంతమైన అనుసంధానం ఏర్పడుతుంది.



అలాగే హైదరాబాద్ నుంచి కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలకు ప్రయాణం సులభతరం కానుంది.

**ఏడు హైస్పీడ్ కారిడార్లకు బడ్జెట్‌లో ప్రతిపాదన**

2026-27 కేంద్ర బడ్జెట్‌లో దేశవ్యాప్తంగా ఏడు హైస్పీడ్ రైలు కారిడార్ల అభివృద్ధిని కేంద్రం ప్రకటించింది. వీటిని ప్రధాన నగరాల మధ్య ఆర్థిక వృద్ధికి దోహదపడే కనెక్టర్లుగా రూపొందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం సుమారు 4,000 కిలోమీటర్ల మేర ఈ కారిడార్లు విస్తరించనున్నాయి. వీటి ద్వారా దాదాపు రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించే అవకాశం ఉందని కేంద్రం అంచనా వేస్తోంది.

**ప్రతిపాదించిన ఏడు కారిడార్లు ఇవే:**

ముంబై-పుణె, పుణె-హైదరాబాద్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-చెన్నై, చెన్నై-బెంగళూరు, ఢిల్లీ-వారణాసి, వారణాసి-సిలిగురి ఈ మార్గాల్లో ప్రయాణ సమయాన్ని గణనీయంగా తగ్గించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అంచనా ప్రయాణ సమయాల ప్రకారం పుణె-హైదరాబాద్ మధ్య 1 గంట 55 నిమిషాలు, హైదరాబాద్-చెన్నై మధ్య 2 గంటల 55 నిమిషాలు, ముంబై-పుణె మధ్య 48 నిమిషాలు, ఢిల్లీ--వారణాసి మధ్య 3 గంటల 50 నిమిషాలు, వారణాసి--సిలిగురి మధ్య 2 గంటల 55 నిమిషాలు పట్టే అవకాశం ఉంది.

**ఇప్పటికే నిర్మాణంలో ముంబై--అహ్మదాబాద్ బుల్లెట్ రైలు**

భారతదేశపు తొలి బుల్లెట్ రైలు ప్రాజెక్టుగా ముంబై--అహ్మదాబాద్ హైస్పీడ్ రైలు కారిడార్ నిర్మాణం కొనసాగుతోంది. సుమారు 508 కిలోమీటర్ల పొడవైన ఈ ప్రాజెక్టును గంటకు 320 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో రైళ్లు నడిచేలా రూపొందిస్తున్నారు. ఈ మార్గంలో మొత్తం 12 స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నారు. మహారాష్ట్రలో నాలుగు, గుజరాత్‌లో ఎనిమిది స్టేషన్లు ఉండనున్నాయి.

**ఆర్థిక రంగానికి కొత్త ఊతం**

హైస్పీడ్ రైలు కారిడార్లు అందుబాటులోకి వస్తే నగరాల మధ్య దూరం తగ్గడంతో పాటు ఆర్థిక కార్యకలాపాలు వేగవంతం కానున్నాయి. ఉద్యోగ, వ్యాపార అవకాశాలు పెరగడంతో పాటు పారిశ్రామిక పెట్టుబడులకు కూడా ప్రోత్సాహం లభించనుంది. ముఖ్యంగా హైదరాబాద్--బెంగళూరు మధ్య వేగవంతమైన రైలు కనెక్టివిటీ ఏర్పడితే తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల మధ్య వాణిజ్య సంబంధాలు మరింత విస్తరించే అవకాశం ఉంది. దక్షిణాదిలో హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, అమరావతి నగరాలు మరింత చేరువ కావడంతో ప్రాంతీయ అభివృద్ధికి కొత్త మార్గాలు ఏర్పడనున్నాయి.

## మేం ఓడినా.. ప్రజల మనసులు గెలుచుకున్నాం



-మొదటిపేజీ తరువాయి

ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం కలిగించాయని పేర్కొన్నారు.

**అధికారంతో ఎన్నికలు గెలవొచ్చు.. ప్రజల విశ్వాసం కాదు**

అధికార బలంతో ఎన్నికల్లో విజయం సాధించవచ్చని, కానీ ప్రజల విశ్వాసాన్ని మాత్రం గెలుచుకోలేరని జగన్ వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యాన్ని అణచివేయగలరేమో కానీ, ప్రజల ఆకాంక్షలను అణచివేయడం సాధ్యం కాదని పేర్కొన్నారు. ఎన్నికల్లో ఎదురైన పరిణామాల నేపథ్యంలో తమ పార్టీ నైతికంగా ప్రజల మద్దతు పొందిందని అభిప్రాయపడ్డారు.

**పార్టీ శ్రేణులకు అభినందనలు**

ఎన్ని అడ్డంకులు ఎదురైనా, దాడులు జరిగినా, నిర్బంధాలు విధించినా వెనుకడుగు వేయకుండా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాడిన పార్టీ నాయకులు, కార్యకర్తలను జగన్ అభినందించారు. ముఖ్యంగా మహిళా కార్యకర్తల పోరాట స్ఫూర్తిని ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులోనూ పోరాటాలను మరింత దృఢంగా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రజల ఆశీస్సులు, నమ్మకంతో తమ రాజకీయ ప్రయాణం ముందుకు సాగుతుందని వైఎస్ జగన్ పేర్కొన్నారు.

## వైసీపీ కంచుకోటలో టీడీపీ జెండా..
## కడప జిల్లాలో కూటమి ప్రభంజనం!




వైసీపీకి కంచుకోటగా భావించే ఉమ్మడి కడప జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి సత్తా చాటింది. జడ్పీటీసీ, ఎంపీటీసీ స్థానాల్లో భారీ విజయాలు నమోదు చేసింది. మొత్తం 39 జడ్పీటీసీ స్థానాలకు గాను 23 ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 16 స్థానాలకు 71 మంది అభ్యర్థులు పోటీ పడగా.. 13 చోట్ల కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. జిల్లాలో టీడీపీ 30, భాజపా 3, జనసేన 3 జడ్పీటీసీ స్థానాలను దక్కించుకున్నాయి. వైసీపీ కేవలం రెండు స్థానాలకే పరిమితమైంది. వైసీపీ అధినేత జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలోనూ టీడీపీ జెండా ఎగిరింది. అక్కడ టీడీపీ అభ్యర్థి భరతి 1,463 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రాజంపేట మండలంలో టీడీపీ అభ్యర్థి పోలి సుబ్బారెడ్డి 17,440 ఓట్ల భారీ ఆధిక్యంతో విజయం సాధించారు. లింగాల జడ్పీటీసీగా టీడీపీ అభ్యర్థి యమ్మనూరు సరళాదేవి గెలుపొందారు. ఎంపీటీసీ స్థానాల్లోనూ కూటమి ఆధిపత్యం ప్రదర్శించింది. జిల్లాలో 351 ఎంపీటీసీ స్థానాలు ఇప్పటికే ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 55 స్థానాలకు ఎన్నికలు జరగ్గా.. 30కి పైగా చోట్ల కూటమి అభ్యర్థులు విజయం సాధించారు. మరికొన్ని స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు గెలుపొందగా.. అక్కడక్కడ వైసీపీ అభ్యర్థులు విజయం సాధించారు.

## పరిషత్ ఎన్నికల్లో ఆసక్తికర ఘటనలు
## జగన్ మేనత్త ఊరిలో టీడీపీ..
## తోడికోడళ్ల పోరులో జనసేన పైచేయి!



ఎన్టీఆర్ జిల్లా గణపవరంలో 20 ఏళ్ల తర్వాత టీడీపీ ఎంపీటీసీ అభ్యర్థి విజయం సాధించారు. ఈ గ్రామం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సోదరి, జగన్ మేనత్త విమలమ్మ స్వగ్రామం కావడం గమనార్హం. నెల్లూరు జిల్లా చిల్లకూరు మండలం తమ్మినపట్నంలో టీడీపీ అభ్యర్థి అరుణ రీకౌంటింగ్ తర్వాత ఒక్క ఓటు తేడాతో గెలుపొందారు. తొలుత ఆరు ఓట్ల తేడా రావడంతో అధికారులు మళ్లీ లెక్కింపు చేపట్టారు. ఫలితం వెలువడిన తర్వాత వైకాపా అభ్యర్థి కౌంటింగ్ కేంద్రం వద్ద బైఠాయించి న్యాయం చేయాలని ఆందోళనకు దిగారు. తూర్పుగోదావరి జిల్లా చాగల్లు మండలం చంద్రవరం ఎంపీటీసీ స్థానంలో టీడీపీ అభ్యర్థి కాట్రూ శ్రీనివాసరావు కేవలం మూడు ఓట్ల ఆధిక్యంతో విజయం సాధించారు. పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట మండలం మాతుమూరు, పాంచాలి ఎంపీటీసీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులుగా పోటీ చేసిన తండ్రి జి.యుగంధర్, కుమార్తె కావ్య గెలుపొందారు. పశ్చిమగోదావరి జిల్లా ఆచంట మండలం పెదమల్లంలో తోడికోడళ్ల మధ్య జరిగిన పోరులో జనసేన అభ్యర్థి బోడపాటి మంగదేవి 18 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అనకాపల్లి జిల్లా సక్కపల్లి 1, 2 ఎంపీటీసీ స్థానాల్లో వైకాపా అభ్యర్థులు తుమ్మ కల్పన, గొడుగుల బంగారాజు గెలుపొందారు. సక్కపల్లి-2 పరిధిలోనే హోంమంత్రి అనిత నివాసం ఉండటం గమనార్హం. పల్నాడు జిల్లా నరసరావుపేటలోని ఏఎం రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు సందర్భంగా బ్యాలెట్ బాక్సులో ఓట్లతోపాటు కరపత్రాలు బయటపడ్డాయి. సత్తెనపల్లి మండలం కంకణాలపల్లి జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల బ్యాలెట్ బాక్సుల్లో ఈ కరపత్రాలను గుర్తించారు. గ్రామానికి వెళ్లే రహదారిలో రైల్వే గేటు వద్ద యూ ఆకారంలో అండర్‌పాస్ నిర్మించవద్దని, ప్రధాన రహదారికి అనుసంధానంగా బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్థులు వాటిలో విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్ స్పందించాలని కోరారు. తిరుపతి రూరల్ జడ్పీటీసీ స్థానంలో వైకాపా అభ్యర్థి చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, టీడీపీ అభ్యర్థి ధనలక్ష్మి తరఫున వారి కుటుంబ సభ్యులు కౌంటింగ్ కేంద్రానికి వచ్చి లెక్కింపును పరిశీలించారు. మరోవైపు పోస్టల్ బ్యాలెట్లలో చెల్లని ఓట్లు భారీగా నమోదయ్యాయి. అల్లూరి జిల్లా అనంతగిరిలో 137 పోస్టల్ ఓట్లకు 91 చెల్లనివిగా తేలాయి.

# అదృష్టం కనిశెట్టి మత్స్యరాజును వరించింది

- రెండవసారి చోడవరం జడ్పిటిసిగా ఎన్నిక
- బీఫారం కోసం చివర వరకు ఉత్కంఠ... ఎట్టకేలకు సాధించాడు

**చోడవరం, నవంబర్7 పెన్ సత్తా...** అదృష్టం అంటే చోడవరం జడ్పిటిసిగా ఎన్నికైన కనిశెట్టి మత్స్యరాజు ది. చివర వరకు తెలుగుదేశం పార్టీ బి ఫారం వస్తుందా లేదా అనేది సందిగ్ధం... బీఫారం వచ్చిన తర్వాత ఎన్నిక ప్రక్రియ.... చివరికి రెండవసారి చోడవరం మండలానికి జడ్పిటిసి గా ఎన్నికయ్యాడు. జడ్పిటిసి కౌంటింగ్ 3 రౌండ్లు జరపగా చివరికి 8674 ఓట్లు మెజార్టీతో వైసిపి అభ్యర్థిపై మత్స్యరాజు విజయం సాధించాడు. కూటమిలో భాగంగా చోడవరం జడ్పిటిసి టికెట్ మొదట టిడిపికి అనుకున్నారు. ఆ తర్వాత బిజెపి కోటా అన్నారు. ఆ తర్వాత టిడిపికి చెందిన పల్లా అర్జున్ కు అన్నారు. తెలుగుదేశం పార్టీ నిర్వహించిన ఐ.వి.ఆర్.ఎస్ సర్వేలో ఎక్కువమంది ఓటర్లు కనిశెట్టి మత్స్యరాజు పేరు చెప్పడంతో చివరికి బీఫారం మత్స్యరాజు కు దక్కింది. ఎన్నెన్నో మలుపులు తిరిగిన తర్వాత వచ్చిన బి ఫారం విజయాన్ని తెచ్చింది. 10 ఏళ్ల క్రితం మత్స్యరాజు జడ్పిటిసి గా ఎన్నికయ్యాడు. మళ్ళీ ఇప్పుడు ఆయన్ను వరించింది.



# ఆయన మంచితనమే విజయానికి కారణం....



- హ్యాట్రిక్ సాధించిన ఎంపీటీసీ బైన ఈశ్వరరావు
- మూడుసార్లు ఎంపీటీసీ, ఒక సారి గ్రామ సర్పంచ్ పదవులు

**చోడవరం, నవంబర్7 పెన్ సత్తా....** మండలంలోని కన్నంపాలెం గ్రామానికి చెందిన బైన ఈశ్వరరావు మూడవసారి ఎంపీటీసీగా విజయం గెలిచి హ్యాట్రిక్ సాధించారు. ఆయన మంచితనమే ఎన్ని మార్లు పోటీ చేసినా విజయమే తప్పా పరాభావం లేదు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు అయిన బైన ఈశ్వరరావు 2014 ఎన్నికల్లోను, 2021 ఎన్నికల్లోను, 2026 ఎన్నికల్లోను ఎంపీటీసీగా విజయం సాధించారు. వైస్ ఎంపీపీ గా కూడా చేశారు. 2006 నుండి 2011 వరకు గ్రామ సర్పంచ్ గా ఏకగ్రీవంగా అయ్యారు. ఆయన రాజకీయ పెట్టుబడి చక్కని చిరునవ్వు, ఎవరైనా కష్టంలో ఉంటే ఆదుకోవడం అదే ఆయన తొలి పెట్టుబడి. గత 20 ఏళ్ల నుండి రాజకీయంలో ఉంటూ తనను నమ్ముకున్న ప్రజలకు సేవ చేసుకుంటూ ప్రతిపక్ష నాయకులను సైతం ఆకట్టుకునే తత్వం ఆయనది. అందువలనే విజయం ఆయన వెంట ఉంటుంది. ఆయన వైసీపీలో ఉండడం ఆ పార్టీకే గర్వకారణం.

# బిజెపి అభ్యర్థి రమణమూర్తి ఘనవిజయం

## వైస్ ఎంపీపీ అయ్యే అవకాశం

**చోడవరం, నవంబర్7 పెన్ సత్తా....** కూటమి లో భాగంగా బిజెపికి చోడవరం నియోజకవర్గంలోని ఒకే ఒక ఎంపీటీసీ సిగ్మెంట్ కేటాయించారు. చోడవరం కోపరేటివ్ కాలనీ ప్రాంతానికి చెందిన ఎంపీటీసీ సిగ్మెంటు 4 నుండి కందర్ప వెంకట నరసింహమూర్తి ( రమణమూర్తి ) పోటీ చేసి వైసిపి అభ్యర్థిపై 484 ఓట్లు మెజార్టీ సాధించారు. వైస్ ఎంపీపీ పదవి ఆయనను వరుస్తుందని పలువురు అంటున్నారు. కుటుంబ పరంగా, వయస్సు రీత్యా పెద్దాయన. బిజెపిని దృష్టిలో పెట్టుకొని వైస్ ఎంపీపీ పదవి వచ్చే అవకాశం ఉందని అంటున్నారు.



# చోడవరం మండలంలో అత్యధిక మెజార్టీ సాధించిన దాడి వెంకట పద్మ



**చోడవరం, నవంబర్7 పెన్ సత్తా....** ప్రాదేశిక ఎన్నికల్లో చోడవరం మండలంలో గాంధీగ్రామం ఎంపీటీసీ సిగ్మెంట్ అభ్యర్థి దాడి వెంకట పద్మ మండలంలో అత్యధిక మెజార్టీ సాధించారు. సమీప వైసిపి అభ్యర్థి పై 906 ఓట్లు మెజార్టీతో ఘన విజయం సాధించారు. తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు దాడి నాగ అప్పారావు సతీమణి వెంకటపద్మ. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఆ గ్రామస్తులు, అతని అభిమానులు ఊరేగింపుగా ఆ గ్రామానికి తీసుకువెళ్లారు. విజయోత్సవాలు జరుపుకున్నారు. పలువురు శు భాకాంక్షలు తెలిపారు.

# చోడవరం మండలంలో కూటమి ఘనవిజయం

- టిడిపి ఎంపీటీసీలు 16
- జనసేన ఎంపీటీసీలు 5
- వైసిపి ఎంపీటీసీలు 3
- బిజెపి 1

**చోడవరం, నవంబర్7 పెన్ సత్తా....** ప్రాదేశిక ఎన్నికల్లో చోడవరం మండలం మరొకసారి తెలుగుదేశానికి కంచుకోట అని నిరూపించింది. 25 ఎంపీటీసీ సిగ్మెంట్లకు గాను తెలుగుదేశం పార్టీకి 16 రాగా, జనసేనకు 5 స్థానాలు వచ్చాయి. అలాగే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి 3 రాగా బిజెపికి ఒకటి వచ్చింది. చోడవరం నియోజకవర్గంలో బిజెపి చోడవరం సిమెంట్ 4 నుండి మాత్రమే పోటీ చేసి ఘన విజయం సాధించింది. కూటమి అభ్యర్థులు విజయ దుందుభి మోగించారు. 25 ఎంపీటీసీ సిగ్మెంట్లులో వైసిపి 3 మాత్రమే కైవసం చేసుకుంది. ఎంపీటీసీ సిగ్మెంట్లు చోడవరం 1 కు గూనూరు అప్పలనాయుడు (టిడిపి ), చోడవరం 2 సత్యవరపు శ్రీనివాసరావు (జనసేన ), చోడవరం 3 ఎడ్ల శిరీష (టిడిపి ), చోడవరం 4 కందర్ప వెంకట నరసింహమూర్తి (రమణమూర్తి, బిజెపి ), చోడవరం 5 కు ఎంపీపీ అభ్యర్థి గూనూరు మల్లునాయుడు (టిడిపి ), చోడవరం 6 బీరా రామకృష్ణ (టిడిపి ), చోడవరం 7 బోధంకి కృష్ణమూర్తి (టిడిపి ), చోడవరం 8 ఎడ్ల రమణమూర్తి (టిడిపి ) విజయం సాధించారు. అలాగే అంబేరుపురం ఎంపీటీసీ దాడి వెంకట అప్పారావు (జనసేన ), గాంధీగ్రామం ఎంపీటీసీ దాడి వెంకట పద్మ (టిడిపి ), చాకిపల్లి ఎంపీటీసీ బైన ఈశ్వరరావు (వైసిపి ), గోవాడ ఎంపీటీసీ బండి సంతోషి లక్ష్మి (జనసేన ), రాయపురాజుపేట ఆడారి విజయలక్ష్మి (వైసిపి ), గౌరీపట్నం ఆకుల నలంద రామలక్ష్మి ( టిడిపి ), అంకుపాలేం బంగారు నూకలక్ష్మి (టిడిపి ), లక్ష్మీపురం భూతనాదం లక్ష్మీకాంతం (టిడిపి ) విజయం సాధించారు. అలాగే కండిపల్లి గంటిముడి లక్ష్మీపార్వతి (టిడిపి ), గవరవరం బొడ్డు ధనలక్ష్మి (జనసేన ), లక్కవరం 1 వబలరెడ్డి నాగ మల్లయ్య గాంధీ (టిడిపి ), లక్కవరం 2 అడ్డూరి రాజు (జనసేన ), జన్నవరం సేనాపతి లక్ష్మి (టిడిపి ), వెంకన్నపాలెం నంబారు వెంకటలక్ష్మి (వైసిపి ), అడ్డూరు ఎలమంచిలి దేముడమ్మ (టిడిపి ) విజయం సాధించారు. నూతనంగా ఎన్నికైన ఎంపీటీసీలకు పలువురు శుభాకాంక్షలు తెలిపి సత్కరించారు.



# ఘనంగా గౌరీ పరమేశ్వరి ల ఉత్సవ విగ్రహాల నిలుపుదల మహోత్సవం.



**అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 07:** పట్టణంలో లో ప్రసిద్ధి చెందిన, 171 సంవత్సరాల చరిత్ర కలిగి వేల్పుల వీధి గౌరీ పరమేశ్వరి ల ఉత్సవ విగ్రహాల నిలుపుదల మహోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ముందుగా ఆలయ వద్ద నుండి మేళతాళాలతో, కర్రల సాముతో వరి దుబ్బుకు ప్రత్యేక పూజలు చేసి పట్టణ పురవీధుల గుండా ఊరేగించారు. గౌరీ పరమేశ్వరుల నూతన ఉత్సవ విగ్రహానికి ప్రత్యేక పూజలు చేసి పట్టణములో ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి నిలుపుదల మహోత్సవం ఘనంగా జరిగింది. అమ్మవారి ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపులు ప్రారంభించిన జనసేన పార్టీ నియోజకవర్ భీమర శెట్టి రామ్మి, కార్పొరేటర్ తాడి శాంతి కుమారి రామకృష్ణ.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ గరికి వెంకట్రావు, సెక్రటరీ నానేపల్లి రవి, కోశాధికారి పోతల రమణ

ఉత్సవకమిటీ సభ్యులు వేల్పుల వీధి పెద్దలు, అధిక సంఖ్యలో మహిళలు, మహిళలు పాల్గొన్నారు.

## జిల్లాలో జడ్పీటీసీ ఎన్నికల్లో కూటమి దూకుడు.

**టీడీపీకి 17, జనసేనకు 5, బీజేపీకి 2, జడ్పీటీసీ స్థానాలు.**

**అనకాపల్లి, పెన్ సత్తా, నవంబర్ 07**: అనకాపల్లి జిల్లాలో నిర్వహించిన జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయింది. జిల్లా లోని మొత్తం 24 జడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు పూర్తి కాగా, అందుబాటులో ఉన్న అధికారిక ఓట్ల వివరాల ప్రకారం తెలుగుదేశం పార్టీ అత్యధిక స్థానాల్లో విజయం సాధించింది. జిల్లా లోని 24 జడ్పీటీసీ స్థానాల్లో తెలుగుదేశం పార్టీ 17 స్థానాల్లో, జనసేన పార్టీ 5 స్థానాల్లో, భారతీయ జనతా పార్టీ 2 స్థానాల్లో అత్యధిక ఓట్లు సాధించాయి. అధికారిక ఓట్ల నివేదిక ప్రకారం అనకాపల్లి, అచ్యుతాపురం, చీడికాడ, చోడవరం, దేవరాపల్లి, గొలుగొండ, కె.కోటపాడు, కోటవురట్ల, మాకవరపాలెం, మునగపాక, నక్కపల్లి, నర్సీపట్నం, నాతవరం, రావికమతం, రోలుగుంట, ఎస్.రాయవరం, వి.మాడుగుల జడ్పీటీసీ స్థానాల్లో టీడీపీ అభ్యర్థులు అత్యధిక ఓట్లు సాధించారు. బుచ్చయ్యపేట, పరవాడ, రాంబిల్లి, సబ్బవరం, యలమంచిలి జడ్పీటీసీ స్థానాల్లో జనసేన పార్టీ అభ్యర్థులు అత్యధిక ఓట్లు సాధించగా, కశింకోట, పాయకరావుపేట జడ్పీటీసీ స్థానాల్లో బీజేపీ అభ్యర్థులు అత్యధిక ఓట్లు సాధించారు. మొత్తం 24 జడ్పీటీసీ స్థానాలకు సంబంధించిన లెక్కింపులో 9,10,219 చెల్లుబాటు ఓట్లు నమోదయ్యాయి. 28,273 ఓట్లు చెల్లనివిగా నమోదయ్యాయి. మొత్తం 9,38,492 ఓట్లు నమోదైనట్లు అధికారిక నివేదికలో పేర్కొన్నారు. జిల్లాలో జడ్పీటీసీ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియను ఎన్నికల నిబంధనలకు అనుగుణంగా, పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించారు. లెక్కింపు కేంద్రాల వద్ద అవసరమైన భద్రతా ఏర్పాట్లు, పర్యవేక్షణ చర్యలు చేపట్టి ఎన్నికల ప్రక్రియను పూర్తి చేశారు.

## చరిత్ర తిరగరాసిన గూనూరు మల్లునాయుడు

- చోడవరం ఎంపీపీగా మల్లుకు అవకాశం
- షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్ తర్వాత ఎంపీపీ

**చోడవరం, నవంబర్7**



**పెన్ సత్తా...** చోడవరం చక్కర కర్మాగారం చైర్మన్ పదవి చేసిన వారికి తర్వాత రాజకీయ భవిష్యత్తు లేదు. కానీ, ఫ్యాక్టరీ చైర్మన్ పదవి చేసిన టిడిపి నాయకులు, రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షులు గూనూరు మల్లునాయుడు మాత్రం చోడవరం మండలం ఎంపీపీగా పదవి వరించనున్నది.

చోడవరం చక్కెర కర్మాగారం చైర్మన్ గా గతంలో పనిచేసిన వేచలపు పాలవెల్లి, పూసర్ల వెంకట్,

ఏడువాక రామునాయుడు (మునసబు ), సాలాపు చిన రామునాయుడు, సకురు పెంటారావు, దొండా కన్నబాబు తదితరులకు ఆ తర్వాత ఏ పదవులు రాలేదు. మాజీ చైర్మన్ బొడ్డేడ రామారావు మాత్రం చైర్మన్ పదవి తర్వాత ఫ్యాక్టరీ డైరెక్టర్ గా ఎన్నిక అయ్యారు. షుగర్ ఫ్యాక్టరీ చైర్మన్ పదవి చేసిన వారికి అదే ఆఖరు పదవి అయ్యేది. ఇప్పుడు గూనూరు మల్లునాయుడు ఆ చరిత్రను తిరగరాశారు. మల్లునాయుడు చోడవరం టౌన్ ఎంపీటీసీ సిగ్మెంట్ 5 నుండి ఎంపీటీసీగా పోటీ చేసి వైసిపి అభ్యర్థి మీద 250 ఓట్లు మెజార్టీతో విజయం సాధించారు. ఇది ప్రత్యక్ష ఎన్నిక కావడంతో ఆయన అభిమానులు చాలా మంది భయపడ్డారు. ఇప్పుడు విజయం సాధించడంతో మల్లు అభిమానులకు మనోధైర్యం పెరిగింది. చోడవరం మండలంలో ఉన్న 25 ఎంపిటిసి సెగ్మెంట్లలో మెజార్టీ కూటమి అభ్యర్థులకు వస్తే మల్లునాయుడు ను ఎంపీపీగా ఎంపిక చేసుకోవడానికి ముందుగా నిర్ణయం తీసుకున్నారు. మల్లునాయుడు కూడా అదే విధంగా మిగిలిన కూటమి ఎంపిటిసిలు ఎక్కువమంది విజయం సాధించడానికి ఆయన కూడా సహకరించారు. స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్ రాజు ఆధ్వర్యంలో ఆయన ఆదేశాలు మేరకు ఎంపిపి అభ్యర్థిగా గూనూరు మల్లునాయుడు రంగంలోకి దిగి మండలంలోని కూటమి ఎంపిటిసి అభ్యర్థులందరినీ కలుపుకుంటూ, తన సెగ్మెంట్ 5 ను కాపాడుకుంటూ ప్రచారం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న సంక్షేమ అభివృద్ధి పథకాలను ప్రజలు చూసి ఎక్కువమంది కూటమి అభ్యర్థులను గెలిపించారు. అదే స్థాయిలో ఈ ప్రజా ప్రతినిధులు అంతా చోడవరం మండలాన్ని అభివృద్ధి పదంలో నడిపించాలని పలువురు కోరుతున్నారు.

# హోం ' టాప్ స్టోరీస్ ' ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌తో డీఎస్పీ దురుసు ప్రవర్తన

ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్‌తో డీఎస్పీ దురుసు ప్రవర్తన



**ప్రకాశం జిల్లా:నవంబర్7 పెన్ సత్తా...** యర్రగొండపాలెం నియోజకవర్గం త్రిపురాంతకం మండలం గణపవరం ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్, డీఎస్పీ మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కౌంటింగ్ కేంద్రంలో త్రిపురాంతకం సీఐ మాతంగి శ్రీనివాస్ విధుల్లో ఉండటంపై అభ్యంతరం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే.. ఆయనను అక్కడి నుంచి పంపించాలని డీఎస్పీని కోరారు. అయితే దీనిపై డీఎస్పీ "మాకేం చేయాలో తెలుసు.. మీరు ముందు ఇక్కడి నుంచి వెళ్లండి" అంటూ దురుసుగా మాట్లాడటం ఎంతవరకు సమంజసమని వైయస్ఆర్‌సీపీ శ్రేణులు ప్రశ్నించాయి. ప్రజలచే ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధితో అధికారులు వ్యవహరించాల్సిన తీరు ఇదేనా అని నిలదీశారు.ప్రజాస్వామ్యంలో ప్రజాప్రతినిధులకు కనీస గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, కౌంటింగ్ కేంద్రాల వద్ద అధికారులు సంయమనం పాటిస్తూ నిష్పక్షపాతంగా వ్యవహరించాలని వైయస్ఆర్‌సీపీ శ్రేణులు కోరాయి.

# బ్యాలెట్ బాక్సుల భద్రత ఏమైంది?

ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అరెస్టు, నల్లపాడు ఘటనపై వైయస్ జగన్ ఆగ్రహం



**తాడేపల్లి:నవంబర్7 పెన్ సత్తా...** గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెంలో పరిషత్ ఎన్నికల పోలింగ్ అనంతరం నాగార్జున విశ్వవిద్యాలయానికి చేరాల్సిన బ్యాలెట్ బాక్సులను నల్లపాడు వద్ద మధ్యలో ఎందుకు దింపారని వైయస్ఆర్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి ప్రశ్నించారు. బ్యాలెట్ బాక్సుల భద్రతపై స్పష్టత ఇవ్వకుండా, ఆ ఘటనను ప్రశ్నించిన వైయస్ఆర్‌సీపీ నేతలు, కార్యకర్తలపై లాఠీఛార్జి చేసి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిని అక్రమంగా అరెస్టు చేసి కేసులు పెట్టడం దుర్మార్గమని మండిపడ్డారు. ఈ ఘటనపై సోషల్ మీడియా వేదికగా వైయస్ జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

### ఎక్స్ వేదికగా వైయస్ జగన్..

వైయస్సార్‌సీపీ శాసనమండలి సభ్యుడు, పార్టీ ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి అక్రమ అరెస్టు, నిర్బంధాన్ని తీవ్రంగా ఖండిస్తున్నాను. ఎన్నికల అక్రమాలను ప్రశ్నిస్తూ పార్టీ అభ్యర్థులతో, ప్రజలతో కలిసి శాంతియుతంగా ఆందోళన చేస్తే, దానిపై తప్పుడు కేసులు పెట్టి, అడ్డగోలుగా అరెస్టు చేసి, నిర్బంధానికి గురిచేయడం దుర్మార్గం. ఎమర్జెన్సీని తలపించే ఈ పాలన అత్యంత హేయం. గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెంలో గురువారం పరిషత్ ఎన్నికల పోలింగ్ ముగిసిన తర్వాత, నేరుగా నాగార్జున వర్శిటీకి చేరాల్సిన బ్యాలెట్ బాక్సులను మధ్యలో నల్లపాడు వద్ద ఎందుకు దింపారు? ఎవరి ఆదేశాలమేరకు ఆ బ్యాలెట్ బాక్సులను దింపారు? అసలు బ్యాలెట్ బాక్సులకు ఉండాల్సిన భద్రత ఏమైంది? స్ట్రాంగ్ రూంకు చేరాల్సిన బ్యాలెట్ బాక్సులు నడిరోడ్డుమీద కనిపిస్తే, కళ్లెదుటే వాటిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మా పార్టీకి చెందిన కార్యకర్తలు, నాయకులు, ప్రజలమీద లాఠీఛార్జి చేస్తారా? తప్పులు మీరుచేసి, ఏకంగా బ్యాలెట్ బాక్సులు మార్చే ప్రయత్నంచేసి, మళ్లీ మావాళ్లపై అక్రమకేసులా? చివరకు ఒక ఎమ్మెల్సీమీద డెకాయిటీ, దొంగతనం కేసులుకూడా పెడతారా? ఇంతకంటే దుర్మార్గం ఏముంటుంది?

ఈ స్థానిక ఎన్నికల్లో... నామినేషన్లు రిగ్గింగ్, నామినేషన్ల స్క్రూట్నీ రిగ్గింగ్, పోలింగ్ బూత్‌ల రిగ్గింగ్, పోలింగ్ సైక్లింగ్, పోలింగ్ పర్సంటేజీల రిగ్గింగ్, చివరకు పోలింగ్ ముగిశాక ఇలా బ్యాలెట్ బాక్సులు కూడా రిగ్గింగ్? చంద్రబాబుగారూ ఈ స్థానిక ఎన్నికల్లో మీరు ఈ రకంగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేస్తుంటే, ఈ తప్పుల్ని ఎవరైనా ప్రశ్నిస్తే, వారిని అరెస్టు చేసి జైలుకు పంపుతారా? చంద్రబాబు

గారూ మీ అధికార, పోలీసు బలాన్ని ప్రయోగించి కట్టడిచేయాలని అనుకున్నంత మాత్రాన, మీరు చేసిన ఎన్నికల అక్రమాలు దాచిపెట్టలేరు. మీ అప్రజాస్వామిక పద్ధతులను దేశమంతా చూస్తూనే ఉంది. ప్రజలు చూస్తూ ఊరుకోరు, ఇలాంటి దుర్మార్గాలను సహించరు, మీకు తగిన బుద్ధిచెప్తారు.

# వెంకట అప్పారావుకు ఘనంగా సత్కారం





**చోడవరం, నవంబర్7 పెన్ సత్తా...** మండలంలోని అంబేరుపురం ఎంపిటిసి గా ఎన్నికైన జనసేన పార్టీ నాయకులు దాడి వెంకట అప్పారావు ను ఆ పార్టీ నాయకులు, టిడిపి నాయకులు, అభిమానులు ఘనంగా సత్కరించారు. చోడవరం సాయిరాం గ్రాండ్ లోను మరియు అంబేరుపురంలో వెంకట అప్పారావు కు సత్కరించి ఆయన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పీలా మహేష్, సాయిరాం గ్రాండ్ శ్రీను, విశాఖ డైయిరీ డైరెక్టర్ దాడి పవన్ కుమార్, పిల్లా శేఖర్, దొడ్డి శ్రీను, జనసేన టౌన్ ప్రెసిడెంట్ కర్రి రమేష్, మాజీ సర్పంచ్ లు వేగి శ్రీనివాసరావు, వేగి ముత్యాలునాయుడు, టిడిపి యూత్ వేగి వాసు, ఎన్.దేముడు తదితరులు పాల్గొన్నారు.

# బ్యాలెట్ బాక్సుల దొంగతనాన్ని అడ్డుకుంటే లేళ్ల అప్పిరెడ్డిపై కేసులా?

- కూటమి సర్కార్ అరాచకం పరాకాష్టకు చేరింది
- మండి పడ్డ మాజీ మంత్రి అంబటి రాంబాబు
- దొంగలను రక్షిస్తూ ప్రశ్నించిన వారిపై తప్పుడు కేసులు పెడుతున్నారు
- పోలీసులే భక్షిస్తుంటే ప్రజలు ఆయుధాలు పట్టాలా?: అంబటి నిప్పులు
- ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అక్రమ అరెస్టుపై గుంటూరు లో మీడియాతో మాట్లాడిన మాజీ మంత్రి శ్రీ అంబటి రాంబాబు, మాజీ ఎంపీ వేణుగోపాలరెడ్డి, నగర అధ్యక్షురాలు ఫాతిమా.
- రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని సమూలంగా పెకిలిస్తున్నారు
- లోకల్ బాడీ ఎన్నికల అక్రమాలపై సుప్రీంకోర్టును ఆశ్రయిస్తాం
- మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి స్పష్టీకరణ
- అధికారులు, పోలీసుల ఏకపక్ష వైఖరి సిగ్గుచేటు
- బ్యాలెట్ బాక్స్‌ను సంరక్షించబోయిన ఎమ్మెల్సీపై డెకాయిట్ కేసు పెట్టడం దారుణం:
- ఆగ్రహం వ్యక్తం చేసిన మోదుగుల
- వైయస్సార్సీపీ నేతలపై దాడులు చేస్తే నామమాత్రపు కేసులు..
- అధికార పార్టీ అక్రమాలు ప్రశ్నిస్తే మాపై నాన్‌బెయిలబుల్ అక్రమ కేసులా?
- సూటిగా ప్రశ్నించిన గుంటూరు నగర పార్టీ అధ్యక్షురాలు నూర్ ఫాతిమా
- రౌడీయిజం, అధికార దుర్వినియోగంతో స్థానిక సంస్థల ఎన్నికలు అపహాస్యం
- నగర అధ్యక్షురాలు షేక్ నూర్ ఫాతిమా ఆగ్రం



**గుంటూరు:నవంబర్7 పెన్ సత్తా...** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వ హయాంలో అరాచకం, అధికార దుర్వినియోగం పరాకాష్టకు చేరాయని, పోలీసులు, ఎన్నికల యంత్రాంగం అధికార పార్టీకి తొత్తులుగా మారి స్థానిక సంస్థల ఎన్నికల్లో యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడ్డాయని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. శనివారం గుంటూరులోని మాజీ మంత్రి శ్రీ అంబటి రాంబాబు క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ ఎంపీ మోదుగుల వేణుగోపాలరెడ్డి, నగర అధ్యక్షురాలు షేక్ నూర్ ఫాతిమాతో కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా గుంటూరు రూరల్ పరిధిలోని వెంగలాయపాలెం బూత్‌లో పోలింగ్ ప్రక్రియ పూర్తయి సీలు వేసిన బ్యాలెట్ బాక్సును బస్సు నుంచి కిందికి దించి, ఎలాంటి భద్రత లేకుండా వేరే చోటకు తరలించేందుకు ప్రయత్నిస్తున్న పోలింగ్ అధికారి చర్యలను అడ్డుకుని ప్రశ్నించిన వైయస్ఆర్‌సీపీ కేంద్ర కార్యాలయ సమన్వయకర్త, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిపై పోలీసులు కక్షపూరితంగా డెకాయిట్ (దోచీ 310) సహా తీవ్రమైన తప్పుడు సెక్షన్లు మోపి 14 రోజుల రిమాండ్‌కు తరలించడాన్ని వారు ముక్తకంఠంతో ఖండించారు. ఓట్లతో కూడిన బ్యాలెట్ బాక్సును దొంగతనంగా ఎత్తుకెళ్లే అధికారికి రక్షణ కల్పిస్తూ, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రయత్నించిన బాధ్యతాయుత ప్రజాప్రతినిధిని అరెస్ట్ చేయడం రాష్ట్రంలో శాంతిభద్రతల దిగజారుడుతనానికి నిదర్శనమని మండిపడ్డారు. ఈ అక్రమ నిర్బంధాలపై న్యాయస్థానాల్లో పోరాడటంతో పాటు త్వరలోనే సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎవరేమన్నారంటే..

బ్యాలెట్ బాక్సుల దొంగతనాన్ని అడ్డుకుంటే మాపైనే దోపిడీ కేసులా?:

అంబటి రాంబాబు, మాజీ మంత్రి

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో అత్యంత క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి గారిపై పూర్తి అన్యాయమైన, అక్రమమైన కేసు బనాయించి 14 రోజుల పాటు రిమాండ్‌కు పంపారు. ఇది ప్రజాస్వామ్యంలో అత్యంత దుర్మార్గమైన చర్య. గుంటూరు ప్రజలంతా ఈ ఘోరాన్ని ప్రత్యక్షంగా చూశారు. వెంగళాయపాలెం బూత్‌కు సంబంధించి పోలింగ్ ముగిశాక ఏజెంట్ల సంతకాలతో సీలు వేసిన బ్యాలెట్ బాక్సును బస్సు నుంచి కిందికి దించి, ఎలాంటి భద్రత లేకుండా వేరే చోటకు తరలించడానికి ప్రయత్నించారు. ఇది ఎన్నికల నిబంధనలకు పూర్తిగా విరుద్ధం. ఈ అక్రమాలపై ప్రశ్నిస్తే, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డిపై అక్రమ కేసులు పెట్టి, అరెస్ట్ చేసి, ఆయన్ను బయటకు రాకుండా అడ్డుకోవడం ఎంతవరకు సమంజసం? ఇది ముమ్మాటికీ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమే. ఈ అక్రమ కేసులకు, అరెస్టులకు మేం భయపడేది లేదు. ప్రజాస్వామ్యాన్ని కాపాడటానికి మా పోరాటం ఆగదు. ఈ అక్రమ కేసులపై న్యాయపోరాటం చేస్తాం. ఈ అక్రమ అరెస్టులపై ప్రజాస్వామ్యవాదులంతా గళమెత్తాలి.

బస్సులో ఎక్కించి స్ట్రాంగ్ రూమ్‌కు తరలించాల్సింది పోయి, మధ్యలోనే ఆ బాక్సును దించి ఒక అధికారి తీసుకెళ్లే ప్రయత్నం చేశాడు. కరెన్సీ నోట్ల కంటే విలువైన ఓట్ల బాక్సును సెక్యూరిటీ లేకుండా అధికారి ఎత్తుకెళ్తుంటే దొంగతనం కాక మరేమనుకోవాలి? మా పార్టీ నాయకులు, కార్యకర్తలు అడ్డుకుని ధర్నా చేశారు. అప్పిరెడ్డి గారు అక్కడికి వెళ్లి ప్రశ్నిస్తే పోలీసులు వచ్చి విచక్షణారహితంగా లాఠీఛార్జ్ చేశారు. ఎఫ్ఐఆర్‌లో 10 సెక్షన్లు పెట్టి, రిమాండ్ రిపోర్టు వచ్చేసరికి బెయిల్ రాకుండా ఉండాలనే కుట్రతో దోపిడీ (దోచీ 310) సెక్షన్‌ను చేర్చారు. ఒక అధికారి బాక్సును ఎత్తుకెళ్తుంటే అతడు దొంగ అవుతాడా లేక అడ్డుకున్న మేము డెకాయిట్లం అవుతామా? ఇంకొకటే తక్కువైంది.. డెడ్‌బాడీ, మహిళ స్టేట్‌మెంట్ దొరికితే మాపై మర్డర్, రేప్ కేసులు కూడా పెట్టేసేవారు.

రక్షించాల్సిన పోలీసులే భక్షిస్తుంటే ప్రజలు ఆయుధాలు ధరించాలా?

రక్షించాల్సిన పోలీసు వ్యవస్థ బ్యాలెట్ బాక్సును దొంగిలిస్తున్న అధికారిని రక్షిస్తూ, అడ్డుకున్న ప్రజాప్రతినిధులను శిక్షిస్తోంది. పోలీసులకు తుపాకులు, లాఠీలు, వాహనాలు ఇచ్చింది అక్రమాలను అడ్డుకోవడానికా లేక అధికార పార్టీ దోపిడీకి కాపలా కాయడానికా? రాష్ట్రంలో రక్షణ కల్పించాల్సిన పోలీసులే ప్రజలను భక్షిస్తుంటే.. ప్రజలు కూడా ప్రైవేట్ సైన్యాలను పెట్టుకోవాలా? ప్రజలే లాఠీలు, ఆయుధాలు పట్టుకుని తమను తాము కాపాడుకోవాల్సిన దీన స్థితిని తీసుకొస్తారా? టీడీపీ నేత పెమ్మసాని చంద్రశేఖర్ కనుసన్నల్లోనే ఈ కుట్రలన్నీ సాగుతున్నాయి. అప్పిరెడ్డి గారిపై ఎన్ని తప్పుడు కేసులు పెట్టినా హైకోర్టు, సుప్రీంకోర్టుల్లో ఆయనకు న్యాయం జరుగుతుండటంతో కక్ష కట్టి ఈ అక్రమ కేసు పెట్టారు. జైళ్లకు వైయస్సార్సీపీ నేతలు భయపడరు; పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, కాకాని గోవర్ధన్‌రెడ్డి, గతంలో నేను కూడా జైళ్లకు వెళ్లాం. నిర్బంధాలతో మా పోరాటాన్ని ఆపలేరు, మరింత రాటుదేలుతాం.

51.5 శాతం పోలింగ్ ప్రజల నిర్లిప్తతకు నిదర్శనం..

గుంటూరులో పోలింగ్ కేవలం 51.5 శాతమే నమోదైంది. ఎన్నికలు సజావుగా జరగడం లేదని ప్రజలు విరక్తి చెంది ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. ఆ పోలైన ఓట్లలోనూ పీవోలు, ఆర్వోలు కూటమి వారికి అనుకూలంగా రిగ్గింగ్‌లు చేసుకున్నారు. గోదావరి జిల్లాల్లో సైకిల్ గుర్తుకు వేసిన బ్యాలెట్లను తెచ్చి అధికారులే నేరుగా కలిపేశారు. తప్పుడు పద్ధతుల్లో స్థానిక సంస్థల ఎన్నికలను చేజిక్కించుకున్నారు. కూటమి ప్రభుత్వం, పోలీస్ యంత్రాంగం, రాష్ట్ర ఎన్నికల సంఘం (రాజుజ), రిటర్నింగ్ అధికారులు కుమ్మక్కై ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. బ్యాలెట్ బాక్సును కూరగాయల తట్టలా నెత్తిన పెట్టుకుని పోలింగ్ ఆఫీసర్ తీసుకెళ్తుంటే పోలీసులు రక్షణ కల్పించడం సిగ్గుచేటు. ముందు ఆ పీవోను సస్పెండ్ చేయాలి. లేళ్ల అప్పిరెడ్డి గారి అరెస్టును ప్రతి ఒక్క ప్రజాస్వామ్యవాది తీవ్రంగా ఖండించాలి. లీగల్‌గా పోరాడి ఆయనను త్వరలోనే బయటకు తీసుకొస్తాం.

ప్రజాస్వామ్యాన్ని సమాధి చేస్తున్నారు.. సుప్రీంకోర్టులో తేల్చుకుంటాం: మోదుగుల వేణుగోపాలరెడ్డి, మాజీ ఎంపీ.

రాజకీయాలు ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం చేయాలి తప్ప కేవలం ఎన్నికల్లో అక్రమంగా గెలవడం కోసం కాదు. ఎన్నికల కమిషన్ అంటే ప్రజాస్వామ్యాన్ని సమూలంగా పెకిలించే 'ఎరాడికేషన్ కమిషన్'గా మారిపోయింది. ఒక భారత పౌరుడిగా, బాధ్యతాయుత ఎమ్మెల్సీగా అధికారి చేస్తున్న తప్పును నిలదీసి, బ్యాలెట్ బాక్స్‌ను సంరక్షించడానికి ప్రయత్నించిన లేళ్ల అప్పిరెడ్డి గారిపై దొంగతనం, దోపిడీ కేసులు పెట్టడం విడ్డూరం. 50వ వార్డులో మేయర్ కరుణాకర్ రెడ్డి బ్యాలెట్ బాక్సుల విధ్వంసంపై ఫిర్యాదు చేసి రీపోలింగ్ అడిగితే చేతగాని కలెక్టర్, ఎన్నికల యంత్రాంగం సమాధానం చెప్పలేకపోయారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న ఈ వ్యవహారాలపై సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ (ఎస్ఎల్పీ) దాఖలు చేసి రీ-ఎలక్షన్ కోసం పోరాటం చేస్తాం.

ఆసుపత్రికి వెళ్తుంటే గేట్లు వేస్తారా? అధికారుల తీరు మారాలి

"నిన్న నా ఆరోగ్యం బాగోలేక జనరల్ చెకప్ కోసం జీజీహెచ్ ఆసుపత్రికి వెళ్తుంటే పోలీసులు దారుణంగా గేట్లు వేశారు. సామాన్య ప్రజలకు వైద్యం అందించే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లకుండా అడ్డుకున్న పోలీసులపై ఎలాంటి కేసులు పెట్టాలి? అధికార పార్టీకి ఒక రూలు, ప్రతిపక్షాలకు ఒక రూలా? పోలీసు అధికారులైన సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. రిటైరైన అనిల్ చంద్ర పునేత వంటి అధికారులను అడ్డం పెట్టుకుని ప్రజాస్వామ్య వ్యవస్థలను నాశనం చేస్తున్నారు. అధికారులు శాశ్వతం, పాలకులు తాత్కాలికం. పేద ప్రజల పక్షాన నిలిచిన టీఎన్ శేషన్ వంటి నిబద్ధత కలిగిన అధికారులను ఆదర్శంగా తీసుకోవాలి తప్ప అధికార పార్టీ తొత్తులుగా వ్యవహరించి జీవితాలను నాశనం చేసుకోవద్దు. రేపు వైయస్సార్సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మీ తప్పులకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది. ఎమ్మెల్యే గల్లా మాధవి, ఆమె భర్త బూత్‌లలోకి, కౌంటింగ్ కేంద్రాల్లోకి ఏ అధికారంతో వెళ్లారో అధికారులు సమాధానం చెప్పాలి.

వైయస్సార్సీపీపై దాడులు జరిగితే పిట్టీ కేసులు.. మాపై అక్రమ బనాయింపులా?

: షేక్ నూర్ ఫాతిమా, గుంటూరు నగర వైయస్సార్సీపీ అధ్యక్షురాలు

నామినేషన్ల ఘట్టం నుంచి నేటి వరకు పోలీసులు పూర్తిగా టీడీపీ కండువాలు కప్పుకుని ఏకపక్షంగా వ్యవహరించారు. ఎన్నికల వేళ మా నాయకులు, కార్యకర్తలపై కత్తులు, రాడ్లు, కర్రలతో దాడులు చేసినా పోలీసులు ప్రేక్షకపాత్ర వహించారు. గెలిచిన తర్వాత కూడా ప్రభుత్వ ఉద్యోగి ఒకరు వైయస్సార్సీపీ కార్యకర్తలపై విచక్షణారహితంగా దాడి చేసి, ఒక ఎస్సీ మహిళను కిందపడేసి కొడితే.. ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా చిన్న పిట్టీ కేసు పెట్టి చేతులు దులుపుకున్నారు. అదే టీడీపీ వాళ్లు చేసే అరాచకాలను ప్రశ్నిస్తే మాత్రం మా పార్టీ నేతలపై నాన్‌బెయిలబుల్, డెకాయిట్, ఎస్సీ-ఎస్టీ అక్రమ కేసులు బనాయిస్తున్నారు.

ప్రజాస్వామ్యబద్ధంగా న్యాయస్థానాల్లోనే తేల్చుకుంటాం

26వ వార్డులో మహేష్ అనే కార్యకర్తపై జరిగిన దాడితో సహా నగరంలో నిత్యం అరాచకాలు సాగుతున్నాయి. ప్రజల ఓట్లతో సంబంధం లేకుండా, దౌర్జన్యాలతో గెలవాలనుకుంటే ఇక ప్రజాస్వామ్యం, ఎన్నికలు ఎందుకు? చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒక సిట్టింగ్ ఎమ్మెల్సీ బ్యాలెట్ బాక్సుల అక్రమ తరలింపును ప్రశ్నిస్తే ఆయనను జైలుకు పంపడం హేయమైన చర్య. కూటమి ప్రభుత్వ కక్షసాధింపు రాజకీయాలను, అక్రమ కేసులను చూసి ఎవరూ భయపడరు. న్యాయవ్యవస్థపై మాకు పూర్తి నమ్మకం ఉంది. అప్పిరెడ్డి గారికి త్వరలోనే బెయిల్ వచ్చేలా లీగల్‌గా పోరాడతాం. కూటమి ప్రభుత్వం సాగిస్తున్న అరాచక పాలనకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారు.

# ప్రజాస్వామ్యానికి బీజేపీ తీవ్ర నష్టం చేసింది

**న్యూఢిల్లీ :** దేశ ప్రజాస్వామ్య వ్యవస్థలు, రాజ్యాంగ సంస్థలు, దేశ మౌలిక స్వరూపం గత 12 ఏళ్లలో తీవ్రంగా దెబ్బతిన్నాయని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థలను బలహీనపరిచిందని విమర్శించారు. ప్రజలు ఈ పరిణామాలను క్రమంగా గుర్తిస్తున్నారని, భవిష్యత్తులో ప్రజాస్వామ్యాన్ని, సుపరిపాలనను పునరుద్ధరించేందుకు రాజకీయ పార్టీలు సమష్టిగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. తన తాజా ఇంటర్వ్యూలో బీజేపీ ప్రభుత్వ పాలన, కాంగ్రెస్ రాజకీయ భవిష్యత్తు, 1975 ఎమర్జెన్సీ, తన వ్యక్తిగత జీవితం, త్వరలో విడుదల కానున్న ఆత్మకథకు సంబంధించిన పలు అంశాలపై ఆమె స్పందించారు.



### ప్రజాస్వామ్య వ్యవస్థలకు తీవ్ర నష్టం

గత పన్నెండేళ్లలో దేశ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ సంస్థలకు జరిగిన నష్టం అంతా ఇంతా కాదని సోనియా గాంధీ వ్యాఖ్యానించారు. ప్రస్తుత ప్రభుత్వం అధికారంలో నుంచి వెళ్లిపోయిన తర్వాత కూడా వ్యవస్థలను తిరిగి గాడిలో పెట్టడం అంత సులభం కాదన్నారు. ఇందుకు సమయం, రాజకీయ పార్టీల నుంచి గట్టి ప్రయత్నం అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రజల్లో అసహనం పెరుగుతోందని, దేశంలో జరుగుతున్న పరిణామాలను వారు అర్థం చేసుకుంటున్నారని చెప్పారు. అయినప్పటికీ దేశ భవిష్యత్తుపై తనకు ఆశావాదం ఉందని, ప్రజలు తిరిగి మెరుగైన పాలనను స్వాగతిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు.

### ప్రతిపక్షాలకు సమాన అవకాశాలు లేవు

కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత పరిస్థితి, భవిష్యత్తుపై స్పందిస్తూ తాను నిరాశావాదంతో లేనని సోనియా తెలిపారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్‌తో పాటు ఇతర ప్రతిపక్ష పార్టీలకు సమాన అవకాశాలు లభించడం లేదని ఆరోపించారు. ఎన్నికల సంఘం సహా కీలక వ్యవస్థలపై అధికార పార్టీ ప్రభావం ఉందని, ప్రధాన స్రవంతి మీడియా, ఆర్థిక బలం, మతాన్ని రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం వంటి అంశాలు ఎన్నికల పోటీలో అసమానతలకు కారణమవుతున్నాయని విమర్శించారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు అనేక రకాల వేధింపులు ఎదుర్కొంటున్నప్పటికీ గ్రామస్థాయి నుంచి పార్టీ శ్రేణులు రాజ్యాంగ విలువల పరిరక్షణ కోసం పోరాడుతున్నాయని చెప్పారు. ఇటీవలి కాలంలో పలు ఎన్నికల్లో అక్రమాలు, ఓట్ల చోరీ జరిగాయనే అంశాలు వెలుగులోకి వచ్చాయని ఆరోపిస్తూ, ప్రజలు కూడా వీటిని గుర్తిస్తున్నారని పేర్కొన్నారు. భావసారూప్యత కలిగిన పార్టీలతో కలిసి కాంగ్రెస్ ముందుకు సాగుతోందని, పార్టీ విజయావకాశాలు రోజురోజుకూ మెరుగుపడుతున్నాయని ధీమా వ్యక్తం చేశారు.

### ఎమర్జెన్సీపై ఇందిర నిర్ణయాన్ని సమర్థించిన సోనియా

1975లో అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీపై కూడా సోనియా కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ సమయంలో ప్రజాస్వామ్య హక్కులు పరిమితమైనప్పటికీ, ఇందిరా గాంధీ అనంతరం పరిస్థితులను సమీక్షించి ప్రజాస్వామ్య ప్రక్రియకు తిరిగి పచ్చారని గుర్తుచేశారు. ఎమర్జెన్సీ సమయంలో హేబియస్ కార్పస్ హక్కును కూడా నిలిపివేశారని అంగీకరించారు. అయితే అప్పటి పరిస్థితుల్లో హింసాత్మక నిరసనలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా రవాణా వ్యవస్థలపై దాడులు, అశాంతి వంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని వివరించారు. 1977 మార్చిలో ఎన్నికలు నిర్వహించేందుకు ఇందిర నిర్ణయం తీసుకున్నారని, ఎమర్జెన్సీ కాలంలో జరిగిన అకృత్యాలపై ఆ తర్వాత బహిరంగంగా విచారం వ్యక్తం చేసి క్షమాపణలు చెప్పారని సోనియా వెల్లడించారు.

### నవంబర్ 10న ఆత్మకథ విడుదల

తన జీవితంలోని అనేక ఆసక్తికర విషయాలను 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' అనే ఆత్మకథలో పొందుపరిచినట్లు సోనియా తెలిపారు. నవంబర్ 10న ఈ పుస్తకం విడుదల కానుంది. యుద్ధానంతర ఇటలీలో తన బాల్యం, రాజీవ్ గాంధీతో పరిచయం, ప్రేమ, వివాహం, గాంధీ కుటుంబంతో ఏర్పడిన అనుబంధం, భారతీయ సంస్కృతిని అలవర్చుకున్న తీరు వంటి అంశాలను ఇందులో వివరించారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీతో తన అనుబంధం, ఆయన కుటుంబం పట్ల ప్రేమ, భారతదేశంతో తనకు ఏర్పడిన అనుబంధం ఈ పుస్తకంలో ప్రధానంగా ఉంటాయని చెప్పారు.

### కుటుంబ త్యాగాలే రాజకీయాల్లోకి వచ్చేలా చేశాయి


గాంధీ కుటుంబం చేసిన త్యాగాలు, ఆ త్యాగాల వెనుక ఉన్న లక్ష్యాలకు ఎదురవుతున్న ముప్పు, కాంగ్రెస్ పార్టీ బలహీనపడుతున్న పరిస్థితులు తనను ప్రజా జీవితంలోకి అడుగుపెట్టేలా చేశాయని సోనియా వెల్లడించారు. ఇంతకాలం తన వ్యక్తిగత జీవిత విశేషాలను బహిరంగంగా పంచుకోవడానికి ఆసక్తి చూపలేదని, ఇప్పుడు తన జీవిత ప్రయాణాన్ని పుస్తక రూపంలో ప్రజల ముందుకు తీసుకురావాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. 2004లో యూపీఏ అధికారంలోకి వచ్చినప్పుడు ప్రధాని పదవిని స్వీకరించకపోవడంపై కూడా స్పందించారు. అప్పటి ప్రభుత్వంలో మన్మోహన్ సింగ్ ప్రధానిగా, తాను పార్టీ నాయకురాలిగా వేర్వేరు బాధ్యతలు నిర్వహించామని, ఆ అనుభవం సానుకూలంగా ఉందని పేర్కొన్నారు.

### సోనియా వ్యాఖ్యలపై బీజేపీ ఎదురుదాడి

సోనియా గాంధీ వ్యాఖ్యలపై బీజేపీ నేతలు కూడా స్పందించారు. ఎమర్జెన్సీ కాలంలో ప్రజాస్వామ్య హక్కులను అణచివేసిన విషయాన్ని ఆమె గుర్తుచేసుకోవాలని కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ హితవు పలికారు. అప్పట్లో వేలాది మంది ప్రతిపక్ష నాయకులను జైళ్లలో పెట్టారని, జర్నలిస్టుల గొంతుకలను నొక్కేశారని విమర్శించారు. దీంతో ప్రజాస్వామ్య పరిరక్షణ అంశంపై కాంగ్రెస్, బీజేపీ మధ్య రాజకీయ విమర్శలు మరోసారి వేడెక్కాయి.

## గాంధీ, నెహ్రూల స్థాయి మోదీకి ఎప్పటికీ రాదు!

**కొచ్చి:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, బీజేపీ ప్రభుత్వంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూలతో పోలిస్తే మోదీ స్థాయి ఎప్పటికీ సరిపోదని వ్యాఖ్యానించారు. మోదీ మరో 120 ఏళ్లు అధికారంలో కొనసాగినా ఆ మహానేతలు దేశానికి చేసిన సేవలకు సమానమైన సేవలు చేయలేరని విమర్శించారు. స్వాతంత్ర్య పోరాటంలో మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న భావజాల సంస్థ పాత్రపై కూడా అభ్యంతరాలు వ్యక్తం చేశారు.



శనివారం కేరళలోని కొచ్చిలో నిర్వహించిన 'జంతర్ మంతర్ ఎట్ కొచ్చి' నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

### గాంధీ దేశ ఆత్మ.. అంబేద్కర్ వెన్నెముక

మహాత్మా గాంధీని భారతదేశ ఆత్మగా, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను దేశ వెన్నెముకగా, జవహర్‌లాల్ నెహ్రూను దేశ మేధస్సుగా అభిజీత్ దీప్కే అభివర్ణించారు. ఈ ముగ్గురు మహానేతలు దేశ నిర్మాణానికి చేసిన కృషి అపారమని పేర్కొన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో మోదీ ప్రాతినిధ్యం వహిస్తున్న భావజాల సంస్థ ఎలాంటి పాత్ర పోషించలేదని, వలస పాలకులకు సేవ చేయడానికే పరిమితమైందని ఆరోపించారు. దేశ స్వాతంత్ర్యం కోసం మహానేతలు పోరాడుతుంటే, అప్పటి ఆ సంస్థ బ్రిటిష్ పాలకులకు అనుకూలంగా వ్యవహరించిందని విమర్శించారు.

### ఓటు హక్కును హరిస్తున్నారా?

ప్రజల ఓటు హక్కును నియంత్రించేందుకు ప్రధాని మోదీ, బీజేపీ ప్రయత్నిస్తున్నారని దీప్కే ఆరోపించారు. ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేసేందుకు ఉపయోగిస్తున్నారని విమర్శించారు. ఈ ప్రక్రియ పేరుతో దేశవ్యాప్తంగా కోట్లాది మంది ఓటర్ల పేర్లు తొలగించారని ఆరోపించారు. స్వతంత్ర, నిష్పక్షపాత ఎన్నికల వ్యవస్థ ఏర్పడే వరకు ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

### త్రివర్ణ పతాకం ఎగురవేస్తూనే ఉంటా

త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసినందుకు తనను, తన ఇద్దరు సోదరులను జైలులో పెట్టారని అభిజీత్ దీప్కే వెల్లడించారు. దేశంలోని ప్రతి ప్రాంతంలోనూ జాతీయ జెండాను ఎగురవేస్తానని, ఎన్ని అడ్డంకులు ఎదురైనా వెనక్కి తగ్గేది లేదని ప్రకటించారు. తనను ఢిల్లీ, మహారాష్ట్ర, కేరళ, తమిళనాడు సహా దేశంలోని ఏ ప్రాంతంలోనైనా అరెస్టు చేసుకోవచ్చని సవాల్ విసిరారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా మళ్లీ త్రివర్ణ పతాకాన్ని ఎగురవేస్తానని స్పష్టం చేశారు.

### ప్రకాశ్ రాజ్ ఆహ్వానంతో కొచ్చికి

కేరళలోని కొచ్చిలో నిర్వహించిన నిరసన కార్యక్రమానికి స్థానిక నిర్వాహకులతో పాటు ప్రముఖ నటుడు, సామాజిక కార్యకర్త ప్రకాశ్ రాజ్ తనను ఆహ్వానించారని దీప్కే తెలిపారు. వారి ఆహ్వానం మేరకే తాను కొచ్చికి వచ్చినట్లు చెప్పారు. దేశంలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరిగే వరకు ఎస్ఐఆర్‌పై తమ ఉద్యమం కొనసాగుతుందని పునరుద్ఘాటించారు. ప్రజాస్వామ్య పరిరక్షణే తమ ఉద్యమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# చైనా క్షిపణులకు చెక్ పెట్టేందుకు అమెరికా మాస్టర్‌ప్లాన్

చైనా క్షిపణి సామర్థ్యం పెరుగుతుండటంతో అమెరికా తన సైనిక వ్యూహాన్ని మార్చుకుంటోంది. పశ్చిమ పసిఫిక్ ప్రాంతంలో వైమానిక కార్యకలాపాలను విస్తరించేందుకు రెండో ప్రపంచ యుద్ధం సమయంలో కీలకంగా పనిచేసిన విమానాశ్రయాలను మళ్లీ వినియోగంలోకి తీసుకురావాలని యోచిస్తోంది. ఇందులో జపాన్‌పై అణుబాంబు దాడులకు అమెరికా బాంబర్ విమానాలు ఉపయోగించిన టినియన్ దీవిలోని చారిత్రక ఎయిర్‌బేస్ కూడా ఉంది. కామన్‌వెల్త్ ఆఫ్ నార్తర్న్ మరియానా దీవుల పరిధిలోని నాలుగు ఎయిర్‌ఫీల్డ్‌ల లో సైనిక శిక్షణ, విమానాల రాకపోకలు, సరకు రవాణా కార్యకలాపాలను పెంచాలని అమెరికా వైమానిక దళం ప్రతిపాదించింది. అక్టోబర్ 28న అమెరికా వైమానిక దళ విభాగం విడుదల చేసిన నోటీసులో ఈ ప్రణాళిక వివరాలను వెల్లడించింది. ఈ నాలుగు ప్రాంతాల్లో ఏడాదికి మొత్తం 6,080 విమాన కార్యకలాపాలు నిర్వహించే అవకాశం ఉంది. ప్రతిపాదన ప్రకారం.. ఒక్కో ఎయిర్‌ఫీల్డ్‌లో ఏడాదికి 1,200 స్థిర రెక్కల విమానాల కార్యకలాపాలు, 320 హెలికాప్టర్ కార్యకలాపాలు చేపట్టవచ్చు. మరో ప్రత్యామ్నాయ ప్రణాళికలో ఈ సంఖ్యను వరుసగా 1,400, 384కు పెంచే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. ఈ విన్యాసాల్లో గరిష్ఠంగా వెయ్యి మంది సైనికులు పాల్గొనవచ్చు. ఒక్కో ప్రాంతంలో 5.5 లక్షల గ్యాలన్ల వరకు ఇంధనం అవసరమవుతుందని అంచనా. తాత్కాలిక సైనిక వసతులు, విమానాల మరమ్మతులు, రవాణా ఏర్పాట్లతో పాటు రక్షణ చర్యల్లో భాగంగా చాఫ్, ఫ్లేర్స్ వినియోగం కూడా ఈ కార్యకలాపాల్లో భాగం కానుంది.



### చైనా క్షిపణి ముప్పే ప్రధాన కారణం

చైనా సైనిక సామర్థ్యం, ముఖ్యంగా దాని క్షిపణి వ్యవస్థల విస్తరణ నేపథ్యంలో అమెరికా ఈ చర్యలకు సిద్ధమవుతోంది. ఒకే సైనిక స్థావరంపై ఆధారపడకుండా విమానాలు, సిబ్బంది, పరికరాలను పలు ప్రాంతాలకు విస్తరించడమే అమెరికా వైమానిక దళం అనుసరిస్తున్న 'ఎజైల్ కాంబాట్ ఎంప్లాయ్‌మెంట్' (ఏసీఈ) వ్యూహం ముఖ్య ఉద్దేశం. శత్రుదేశం ఒక ప్రధాన స్థావరంపై దాడి చేసినా మిగిలిన ప్రాంతాల నుంచి కార్యకలాపాలు కొనసాగించేలా ఈ విధానం ఉపయోగపడుతుంది. తైవాన్ చుట్టూ యుద్ధ పరిస్థితులు తలెత్తితే పశ్చిమ పసిఫిక్‌లోని అమెరికా సైనిక స్థావరాలు చైనా క్షిపణులకు లక్ష్యంగా మారే ప్రమాదం ఉందని వాషింగ్టన్ ఆందోళన చెందుతోంది. గువామ్‌లోని ఆండర్సన్ వైమానిక స్థావరం అమెరికా కార్యకలాపాలకు కీలకం. అక్కడి రన్‌వేలు, ఇంధన నిల్వలు, రవాణా వ్యవస్థలకు నష్టం వాటిల్లితే యుద్ధ సమయంలో విమానాల మోహరింపు కష్టమవుతుంది. గువామ్‌కు ఉత్తరాన 100 నాటికల్ మైళ్లలోపే ఉన్న నార్తర్న్ మరియానా దీవులు ఈ సమస్యకు ప్రత్యామ్నాయంగా మారవచ్చని అమెరికా భావిస్తోంది. వాణిజ్య విమానాశ్రయాల నుంచి తాత్కాలిక ఏర్పాట్లతో పనిచేసే ప్రాంతాల వరకు భిన్నమైన వాతావరణాల్లో సైనిక కార్యకలాపాలను పరీక్షించేందుకు ఈ నాలుగు ఎయిర్‌ఫీల్డ్‌లు ఉపయోగపడనున్నాయి. ఈ ప్రణాళిక ద్వారా ఇండో-పసిఫిక్ ప్రాంతంలో తన వైమానిక బలగాల మోహరింపును మరింత విస్తరించాలని అమెరికా లక్ష్యంగా పెట్టుకుంది.

## చమురు శుద్ధిలో భారత్ దూకుడు..

ముడి చమురు అవసరాల్లో దాదాపు 88 శాతం దిగుమతులపైనే ఆధారపడుతున్న భారత్.. శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతుల్లో మాత్రం ప్రపంచంలో కీలక శక్తిగా ఎదుగుతోంది. అమెరికా, ఐరోపా దేశాలు చమురు శుద్ధి సామర్థ్యాన్ని తగ్గించుకుంటుంటే.. భారత్ మాత్రం దాన్ని విస్తరిస్తోంది. దీంతో అంతర్జాతీయ చమురు మార్కెట్‌లో దేశానికి వ్యూహాత్మక ఆధిక్యం లభిస్తోందని 'ఇండియా నెరేటివ్' కథనం విశ్లేషించింది. 2026 ఏప్రిల్ నాటికి భారత్ చమురు శుద్ధి సామర్థ్యం ఏడాదికి 267.1 మిలియన్ టన్నులుగా ఉంది. రోజుకు సుమారు 53 నుంచి 56 లక్షల బ్యారెళ్లకు సమానమైన ఈ సామర్థ్యంతో ప్రపంచంలో నాలుగో స్థానంలో నిలిచింది. అమెరికా, చైనా, రష్యా తొలి మూడు స్థానాల్లో ఉన్నాయి. 2030 నాటికి శుద్ధి సామర్థ్యాన్ని 300 మిలియన్ టన్నులకు పెంచాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. దీర్ఘకాలంలో 400 మిలియన్ టన్నులకు చేర్చాలని భావిస్తోంది. భారత్ రోజుకు 54 నుంచి 56 లక్షల బ్యారెళ్ల ముడి చమురును దిగుమతి చేసుకుంటోంది. ఇందులో రష్యా వాటా ఇటీవల 18 నుంచి 20 లక్షల బ్యారెళ్లుగా ఉంది. మొత్తం దిగుమతుల్లో ఇది దాదాపు 35 శాతం. గతంలో ఈ వాటా 50 శాతాన్ని దాటిన సందర్భాలున్నాయి. ధరల ఆధారంగా భారత్ కొనుగోళ్ల నిర్ణయాలు తీసుకుంటోందని కథనం పేర్కొంది. మరోవైపు శుద్ధి చేసిన పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా భారత్‌కు భారీ ఆదాయం వస్తోంది. 2026 సెప్టెంబర్‌తో ముగిసిన ఆరు నెలల్లో ఈ ఎగుమతుల విలువ 27.2 బిలియన్ డాలర్లకు చేరింది. ఇందులో డీజిల్ వాటా 12.6 బిలియన్ డాలర్లు. సెప్టెంబర్‌లో రోజుకు సుమారు 6.2 లక్షల బ్యారెళ్ల డీజిల్‌ను భారత్ ఎగుమతి చేసింది. ఇందులో దాదాపు సగం ఐరోపా దేశాలకే వెళ్లింది. రష్యా ఉత్పత్తులపై పరిమితులు, ఐరోపాలో రిఫైనరీల మూసివేత, మధ్యప్రాచ్యంలో నిర్వహణ పనుల కారణంగా ఏర్పడిన కొరతను భారత ఎగుమతులు కొంతవరకు భర్తీ చేస్తున్నాయి. రష్యా చమురు కొనుగోళ్ల విషయంలో భారత్‌పై అమెరికా ఆంక్షలు, సుంకాల ఒత్తిడి తెస్తున్నా.. భారత రిఫైనరీల్లో శుద్ధి చేసిన ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌లో ఇంధన సరఫరాకు ఉపయోగపడుతున్నాయని కథనం విశ్లేషించింది. ఇంధన ధరలు పెరిగినప్పుడు అమెరికా కూడా కొన్ని ఆంక్షల విషయంలో మినహాయింపులు ఇచ్చిందని గుర్తుచేసింది. భారత్ రిఫైనింగ్ సామర్థ్యం పెరిగితే ప్రపంచ మార్కెట్‌లో సరఫరా సమతుల్యతను ప్రభావితం చేసే స్థాయిలో దేశం నిలుస్తుందని పేర్కొంది.




# ఆకాశమే హద్దుగా.. 13,629 అడుగుల ఎత్తులో భారత వాయుసేన ప్రపంచ రికార్డు

**లడఖ్‌లో భారత వాయుసేన చారిత్రక ఘనత**
**13,629 అడుగుల ఎత్తులో ఐఎల్-76ఎండీ ల్యాండింగ్**
**న్యోమా ఎయిర్‌ఫీల్డ్‌లో విజయవంతంగా దిగిన విమానం**
**ఈ తరహా విమానానికి ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన ల్యాండింగ్**
**ఎల్ఏసీకి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఎయిర్‌ఫీల్డ్**
**తక్కువ గాలి సాంద్రతలో ల్యాండింగ్ చేయడం సవాలు**

లడఖ్‌లో భారత వాయుసేన అరుదైన ఘనత సాధించింది. అత్యంత ఎత్తైన ప్రాంతాల్లో భారీ విమానాలను నడిపే సామర్థ్యాన్ని చాటుతూ.. ఐఎల్-76ఎండీ రవాణా విమానాన్ని 13,629 అడుగుల ఎత్తులో విజయవంతంగా ల్యాండ్ చేసింది. తూర్పు లడఖ్‌లోని న్యోమా ఎయిర్‌ఫీల్డ్‌లో ఈ చారిత్రక ల్యాండింగ్ జరిగింది. ప్రపంచంలో ఈ తరహా విమానానికి ఇదే అత్యంత ఎత్తులో జరిగిన ల్యాండింగ్ అని భారత వాయుసేన ప్రకటించింది.

ఈ ఘనతకు సంబంధించిన ఫొటోలు, వీడియోను వాయుసేన సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. విమానం సామర్థ్యంతోపాటు సిబ్బంది నైపుణ్యం, కచ్చితత్వం, వృత్తి నైపుణ్యానికి ఈ విజయం నిదర్శనమని పేర్కొంది. దేశ వ్యూహాత్మక రవాణా సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేసే కీలక ముందడుగుగా అభివర్ణించింది. చైనా సరిహద్దులోని వాస్తవాధీన రేఖ (ఎల్ఏసీ)కి సమీపంలో న్యోమా ఎయిర్‌ఫీల్డ్ ఉంది. సరిహద్దుకు సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో సైనికపరంగా దీనికి ఎంతో ప్రాధాన్యం ఉంది. ఇక్కడి ఎత్తైన ప్రాంతాల్లో గాలి సాంద్రత తక్కువగా ఉంటుంది. దీంతో విమానాలకు ఇంజిన్ పనితీరు, గాల్లోకి లేచే సామర్థ్యం తగ్గుతాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారీ రవాణా విమానాన్ని సురక్షితంగా దించడం సవాలుతో కూడుకున్న పని. రష్యా మూలాలున్న ఐఎల్-76ఎండీ నాలుగు ఇంజిన్ల భారీ రవాణా విమానం. సైనికులు, ఆయుధ సామగ్రి, ఇతర భారీ సరకులను మారుమూల ప్రాంతాలకు తరలించేందుకు వాయుసేన దీన్ని వినియోగిస్తోంది. న్యోమాలో ఈ విమానం ల్యాండింగ్ కావడం సరిహద్దు ప్రాంతాల్లో సైనిక అవసరాలకు వేగంగా స్పందించే భారత సామర్థ్యాన్ని చాటిందని రక్షణ రంగ వర్గాలు పేర్కొంటున్నాయి.



## ఈ20 పేరుతో ప్రజలకు 420 మోసం చేస్తున్నారా?

**న్యూఢిల్లీ :** దేశంలో ఈ20 పెట్రోల్‌లో ఇథనాల్ మిశ్రమం అంశం రాజకీయ దుమారం రేపుతోంది. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలపాల్సి ఉండగా, అంతకుమించి మిశ్రమం చేస్తున్న చమురు కంపెనీలపై కేంద్ర ప్రభుత్వం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ప్రశ్నించారు. కర్ణాటకలో నిర్వహించిన పరీక్షల్లో పలు పెట్రోల్ నమూనాల్లో నిర్దేశిత పరిమితికి మించి ఇథనాల్ ఉన్నట్లు వెల్లడైందని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై శనివారం ఎక్స్ వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని విమర్శలు గుప్పించారు. మరోవైపు, రాహుల్ ఆరోపణలను ప్రభుత్వ రంగ చమురు సంస్థలు ఖండించడంతో ఈ వివాదం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

### ఈ20 కాస్త 420గా మారింది!

పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ కలుపుతున్నామని కేంద్రం చెబుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో పరిస్థితి మరోలా ఉందని రాహుల్ గాంధీ ఆరోపించారు. కర్ణాటక ప్రభుత్వం ఏడు జిల్లాల నుంచి సేకరించిన 14 పెట్రోల్ నమూనాలను గుర్తింపు పొందిన ప్రయోగశాలల్లో పరీక్షించగా, 11 నమూనాల్లో ఇథనాల్ శాతం 20 శాతానికి మించి ఉన్నట్లు పేర్కొన్నారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్) నమూనాలో 31.2 శాతం, హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) నమూనాలో 30.5 శాతం ఇథనాల్ ఉన్నట్లు పరీక్షల్లో తేలిందని వెల్లడించారు. భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), నయారా, షెల్ సంస్థలపైనా ఆరోపణలు చేశారు. ఈ20 పేరుతో విక్రయిస్తున్న ఇంధనం 420గా మారిందంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. అధిక శాతం ఇథనాల్ కలిగిన పెట్రోల్ వల్ల వాహనదారులు నష్టపోతున్నారని రాహుల్ విమర్శించారు. ఇథనాల్ మిశ్రమాన్ని తట్టుకునే సామర్థ్యం లేని వాహనాల్లో ఈ ఇంధనాన్ని వినియోగిస్తే ఇంజిన్ పనితీరుపై ప్రభావం పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. మైలేజీ తగ్గడంతో పాటు వాహనాల నిర్వహణ, మరమ్మతుల ఖర్చులు పెరుగుతాయని ఆరోపించారు.

# షర్మిల ఓవర్ కాన్ఫిడెన్స్



బాపట్ల జిల్లా చీరాల మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ 42 వార్డుల్లో పోటీ చేసి 10 స్థానాలు గెలుచుకుందని వైఎస్ షర్మిల తెలిపారు. ఈ విజయానికి స్థానిక పార్టీ అధ్యక్షుడు ఆమంచి కృష్ణమోహన్ కృషే కారణమని అభినందించారు. చీరాలలో కాంగ్రెస్ రెండో స్థానంలో నిలిచి ప్రతిపక్ష పాత్ర పోషించనుందని పేర్కొన్నారు. అయితే, రాష్ట్రవ్యాప్తంగా పార్టీ పుంజుకోవాలంటే ఆమంచి తరహాలో జిల్లాలవారీగా బలమైన నాయకత్వం, క్షేత్రస్థాయి సంస్థాగత బలోపేతం అవసరమనే చర్చ సాగుతోంది. బాపట్ల జిల్లా చీరాల మునిసిపాలిటీకి జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 10 వార్డులను దక్కించుకుంది. ఇది ఒకరకంగా.. పార్టీకి బూస్ట్ ఇచ్చిన ట్టేనన్న చర్చ సాగుతోంది. ఈ వ్యవహారంపై స్పందించిన షర్మిల.. 44 స్థానాల్లో భాగంగా, 42 స్థానాల్లో అభ్యర్థులను నిలబెట్టి, 10 స్థానాలను గెలిచామని పేర్కొన్నారు. పార్టీ పుంజుకుంటోందనడానికి ఇదే పెద్ద ఉదాహరణగా ఆమె పేర్కొన్నారు. అయితే.. ఈ విజయం పూర్తిగా స్థానిక జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆమంచి కృష్ణమోహన్‌కే దక్కునుందని చెప్పారు. పార్టీని రెండో స్థానంలో నిలబెట్టడంలో ప్రత్యక్ష పాత్ర పోషించారని అభినందించారు. కాంగ్రెస్ సారథ్యంలో చీరాలలో అభ్యర్థుల గెలుపు ఆమంచి కష్టానికి దక్కిన ప్రతిఫలమని ఆమె పేర్కొన్నారు.

స్థానికంగా ప్రజా సమస్యలపై ఆమంచి అకుంఠిత పోరాట పటిమకు నిదర్శనమన్న షర్మిల.. చీరాల మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం.. నిజమైన ప్రజాస్వామ్య విజయంగా పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కాంగ్రెస్ పార్టీనే ఇక ప్రత్యామ్నాయం అనడానికి ఇదొక సంకేతమని తెలిపారు. ప్రజల గొంతుకను నొక్కివట్టాలని చూసిన కూటమి శక్తులను ఎదురించి, అధికార బలాన్ని తట్టుకుని, ప్రలోభాలకు లొంగకుండా, ప్రజా పక్షాన నిలిచి పోరాడి కాంగ్రెస్ వార్డు సభ్యులు గెలిచారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అభ్యర్థులను నమ్మి ఓటేసి గెలిపించిన చీరాల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. మున్సిపాలిటీ పీఠాన్ని కైవసం చేసుకోలేక పోయినా, గౌరవ ప్రదమైన స్థానాలు దక్కించుకొని, ప్రతిపక్ష పాత్ర పోషించబోతున్న కాంగ్రెస్ దే చీరాలలో అసలైన నైతిక విజయమని షర్మిల పేర్కొన్నారు. చీరాల ప్రజల సమస్యలపై నిరంతరం పోరాడుతూ, కూటమి నిర్లక్ష్యాన్ని ఎప్పటికప్పుడు ఎండగట్టే విధంగా, అసలైన ప్రతిపక్ష పాత్ర పోషించాలని, గెలుపొందిన మన కాంగ్రెస్ పార్టీ వార్డు సభ్యులు అంకితభావంతో పనిచేయాలని షర్మిల పిలుపునిచ్చారు. ఈ విజయం రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తుందని చెప్పారు. పార్టీ గతంలో ఏ విధంగా అయితే.. ప్రజలకు చేరువ అయిందో ఇప్పుడు కూడా అలానే చేరువ అవుతుందని చెప్పారు.

**ఆశలు నెరవేరాలంటే..**

అయితే.. షర్మిల పేర్కొన్న విషయం ప్రకారం.. కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో పుంజుకుదా? అంటే.. సందేహమే. ఎందుకంటే రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ పోటీ చేసినా.. ఎక్కడా మెరుగైన ప్రాతినిధ్యం ప్రదర్శించలేదు. కానీ, ఒక్క చీరాలలో మాత్రం ఆమంచి కృష్ణమోహన్ ప్రభావంతోనే పార్టీ పుంజుకుందన్నది సుస్పష్టం. అయితే.. ఆమంచి మాదిరిగా జిల్లాల వారీగా నాయకులు పుంజుకుంటే.. అప్పుడు పార్టీకి షర్మిల ఆశిస్తున్న ట్టు పునర్వైభవం వచ్చే అవకాశం లేకపోలేదు. కానీ, ఆమేరకు పార్టీనిసంస్థాగతంగా బలోపేతం చేసేందుకు క్షేత్రస్థాయిలో నాయకులు ఉన్నారా? అనేది ప్రశ్న. అయితే.. షర్మిల ఈదిశగా ఆలోచన చేస్తే.. కొంత మేరకు పుంజుకునే అవకాశం కనిపిస్తుంది.

# ఎవరికి ఎన్ని సీట్లు? జిల్లాల వారీగా గెలుపు లెక్కలు



ఏపీలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో కూటమి పార్టీలు భారీ ఆధిక్యం సాధించాయి. 659 జడ్పీటీసీ స్థానాలకు గాను 76 ఏకగ్రీవం కాగా, పోలింగ్ జరిగిన స్థానాల్లోనూ కూటమి హవా కొనసాగింది. పల్నాడు జిల్లాలో టీడీపీ అభ్యర్థి నాగోతు వెంకట లక్ష్మీ సరోజ 32,919 ఓట్ల మెజార్టీతో రికార్డు సృష్టించారు. వైసీపీ కడప జిల్లాలో కేవలం రెండు జడ్పీటీసీ స్థానాలకే పరిమితమైంది.

జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల ఫలితాల్లో కూటమి దూసుకుపోతోంది. రాష్ట్రంలోని 28 జిల్లాల్లోనూ కూటమి పార్టీల హవాయే నడుస్తోంది. మొత్తం659 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఇందులో 77 స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. కూటమి పార్టీలు 76 , వైసీపీ ఒక్కచోట పోటీలేకుండా గెలిచాయి. ఇక పోలింగ్ జరిగిన 582 స్థానాల్లో కూటమి పూర్తిస్థాయిలో ఆధిక్యం కనబరుస్తోంది. సాయంత్రం 6 గంటల వరకు అందిన సమాచారం ప్రకారం కూటమి పార్టీలు 184 స్థానాల్లో గెలిచాయి. మరో 122 చోట్ల ఆధిక్యంలో కొనసాగుతున్నాయి. అదే సమయంలో ప్రతిపక్షం వైసీపీ కేవలం 5 చోట్ల మాత్రమే గెలుపొందింది. ఇంకో 16 చోట్ల ఆధిక్యంలో ఉంది. ఇందులో తుది ఫలితం ఎవరికి అనుకూలంగా ఉంటుందోనని ఆయా పార్టీల నేతలు ఆందోళన చెందుతున్నారు.

ఇక 7767 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఇందులో కూటమి పార్టీలు దాదాపు 5 వేల స్థానాలలో విజయం సాధించాయి. ప్రతిపక్షం 830 చోట్ల మాత్రమే విజయం సాధించింది. ఇతరులు మరో 148 స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతున్నారు. ఎంపీటీసీ స్థానాల్లో ఒక్క నంద్యాల జిల్లాలో తప్ప మరెక్కడా వైసీపీ మూడు అంకెల స్కోరు దాటలేదు. ఈ జిల్లాలో కూటమి పార్టీలు 195 స్థానాల్లో గెలుపొందగా, వైసీపీ 112 చోట్ల ఆధిక్యంలో కొనసాగుతోందని చెబుతున్నారు. మరోవైపు మొత్తం 28 జిల్లాల్లో ఎక్కడా వైసీపీ జడ్పీ పీఠంను దక్కించుకునే పరిస్థితి కనిపించడం లేదని అంటున్నారు.

**పల్నాడు జిల్లాలో రికార్డు మెజార్టీ**

జడ్పీ ఎన్నికల్లో ఇప్పటికే మెజార్టీ స్థానాలు ఏకగ్రీవంగా గెలుచుకున్న టీడీపీ పోలింగ్ జరిగిన చోట సరికొత్త రికార్డులు నమోదు చేసింది. పల్నాడు జిల్లాలో మొత్తం 28 జడ్పీటీసీ స్థానాలు ఉండగా, ఇందులో 18 ఏకగ్రీవమయ్యాయి. ఇక ఎన్నికలు జరిగిన చోట కూటమి పార్టీలే ఆధిక్యం కొనసాగిస్తున్నాయి. నకరికల్లు మండల జడ్పీటీసీగా పోటీ చేసిన టీడీపీ అభ్యర్థి డాక్టర్ నాగోతు వెంకట లక్ష్మీ సరోజ ఏకంగా 32,919 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. రాష్ట్రంలో అత్యధిక మెజార్టీ సాధించిన నాయకురాలిగా రికార్డు నమోదు చేశారు. అదేవిధంగా ఇదే జిల్లాలోని పెదకూరపాడు నియోజకవర్గం క్రోసూరు జనసేన అభ్యర్థి పమిడిపాటి శ్రీనివాసరావు దాదాపు 30 వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. క్రోసూరు మండలంలో మొత్తం 38 వేల ఓట్లు పోలవ్వగా, జనసేన అభ్యర్థికి 30 వేల ఓట్లు సాధించడం విశేషం. నకిరికల్లు, క్రోసూరు మండలాలే కాకుండా పల్నాడు జిల్లాలో చాలా చోట్ల కూటమి పార్టీల అభ్యర్థులు మంచి మెజార్టీతో విజయకేతనం ఎగురవేశారని చెబుతున్నారు. నూజెండ్లలో జనసేన అభ్యర్థి బాలప్రసాద్ సుమారు 29 వేలు, మాచవరం టీడీపీ అభ్యర్థి కత్తి సరోజిని సుమారు 23 వేల ఓట్ల ఆధిక్యం సాధించారు.

**కడప వైసీపీ ఖాతాలో రెండు**

ఇక ఈ ఎన్నికల్లో ప్రతిపక్షం వైసీపీ చేదు ఫలితాలను ఎదుర్కొంది. మొత్తం 28 జిల్లాల్లో ఎక్కడా ఆధిక్యం కనబరచలేకపోయింది. మాజీ ముఖ్యమంత్రి వైసీపీ అధినేత జగన్మోహనరెడ్డి
సొంత నియోజకవర్గ కేంద్రమైన పులివెందుల జడ్పీటీసీ స్థానాన్ని కూడా వైసీపీ కోల్పోయింది. పులివెందుల నియోజకవర్గంలో మొత్తం ఏడు మండలాలు ఉండగా, ఇందులో రెండు చోట్ల మాత్రమే వైసీపీ గెలిచింది. మిగిలిన ఐదు చోట్ల కూటమి హవాయే నడిచింది. నియోజకవర్గంలోని వేంపల్లి జడ్పీటీసీగా వైసీపీ అభ్యర్థి బత్తుల వెంకట శివలక్ష్మమ్మ, వేముల జడ్పీటీసీగా అదే పార్టీ అభ్యర్థి సత్యప్రభావతమ్మ గెలుపొందారు. ఈ జిల్లాలో వేంపల్లి, వేముల తప్ప మరెక్కడా వైసీపీ ఖాతా తెరవలేదు. మొత్తం 36 జడ్పీటీసీ స్థానాలకు 23 చోట్ల ఇది వరకే ఏకగ్రీవంగా టీడీపీ కూటమి గెలుచుకుంది.

# లోకల్ రిజల్ట్ : జనాలకు ఇంట్రెస్ట్ తగ్గిందా ?

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలపై గతంలో కనిపించిన ఉత్కంఠ ఈసారి తగ్గిపోయింది. 2021లో వైసీపీ ఏకపక్ష విజయాలు సాధించగా, ప్రస్తుతం కూటమి ఘన విజయాలు నమోదు చేస్తోంది. దీంతో ఫలితాలు ముందే తెలిసిపోతున్నాయనే భావన ప్రజల్లో నెలకొందని విశ్లేషకులు అంటున్నారు. అయితే ప్రజాస్వామ్యంలో బలమైన ప్రతిపక్షం, పోటీ ఉండటం అవసరమని అభిప్రాయపడుతున్నారు.

ఏపీలో స్థానిక సంస్థల ఎన్నికలు వరసగా జరిగాయి. ఫలితాలు వస్తున్నాయి. అయితే గతంలో ఉన్న క్యూరియాసిటీ ఇపుడు కనిపించడం లేదు. నిజానికి ఏపీలో ఏ చిన్న ఎన్నిక అయినా విపరీతమైన హైప్ క్రియేట్ అవుతుంది. పోటీలు పందేలు అటూ ఇటూ మోహరించి మరీ సవాళ్ళు ప్రతి సవాళ్ళూ ఉంటాయి. కానీ ఈసారి చూస్తే తేడా బాగానే కనిపిస్తోంది. ఎందుకు అనేది చర్చ కాదు, జనాలకు ఫలితం ముందే తెలిసిపోయింది అన్నదే దీనిని జవాబుగా ఉంది.

**సహజంగానే :**

ఇక చూస్తే సహజంగానే స్థానిక సంస్థల ఎన్నికల ఫలితాలు ఎపుడూ అధికార పక్షానికి అనుకూలంగా ఉంటాయి. అయితే అనేక రాష్ట్రాల్లో ఈ ఎన్నికలు చూసినపుడు 60 -40 రేషియో లేదా 70-30 రేషియోలో అధికార విపక్షాలకు మధ్య ఫలితాలు ఉంటాయి. కానీ ఏపీలో చూస్తే 2021 నుంచి సీన్ మారింది సెంట్ పర్సెంట్ స్ట్రైక్ రేట్ ని అధికార పార్టీలు కోరుకుంటున్నాయి. అలాగే ఎన్నికల తతంగం సాగుతోంది. దాంతో రిజల్ట్ మీద కూడా పెద్దగా ఆసక్తి అయితే ఉండడం లేదని అంటున్నారు.

**ఫీ అంటే ఫీ :**

నిజానికి ఏపీలో రెండు పార్టీలు రెండు కుటుంబాలు అని అంటూంటారు. కానీ లోకల్ బాడీస్ విషయంలో చూస్తే 2021లో కానీ 2026లో కానీ ఈ రెండు అన్నది ఎక్కడా కనిపించలేదు. అంతా ఏకపక్షంగా సాగడమే దానికి కారణం. 2021లో కూడా వైసీపీ ఏకపక్ష వైఖరిని ప్రదర్శించింది. దాంతో ఫలితాలు అన్నీ ఫ్యాన్ నీడకు చేరిపోయాయి. ఇపుడు కూటమికి ఘన విజయాలు దక్కుతున్నాయి. తేడా ఏమీ లేదని జనం కూడా నిర్ధారణకు వచ్చేశారు అని అంటున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీ నేతలు పెడుతున్న గగ్గోలు కానీ వారి పెడబొబ్బలు కానీ పెద్దగా జనాలకు పట్టని అంశాలుగా మారిపోతున్నాయని అంటున్నారు.


**నీవు నేర్పిన విద్యయే :**

ఇక నీవు నేర్పిన విద్యయే నీరజాక్షా అని పురాణ వ్యాఖ్యానం ఉంది. అలా వైసీపీ ఆనాడు చేసిన దానికి ఈనాడు రిజల్ట్ ఒక రిటార్ట్ అని సగటు జనం అనుకోవాల్సి వస్తోంది. అందుకే వైసీపీ వాదనలు వీగిపోతున్న పరిస్థితులు ఉన్నాయని అంటున్నారు. తమకు అన్యాయం జరుగుతోంది అని వైసీపీ గొంతెత్తుతున్నా అది ఒంటరి స్వరంగా మారిపోవడానికి ఇదే కారణం అని అంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను ఒక ప్రహసనంగా మార్చడంలో అందరి పాత్ర ఉందని ఘాటు విమర్శలు ఉన్నాయి. ఈ కారణం చేతనే ఫలితాల పట్ల కూడా ఆసక్తి తగ్గిపోయింది అని అంటున్నారు. మామూలుగా అయితే టీవీ సహా ప్రధాన ప్రసార మాధ్యమాలలో బిగ్ డే జడ్జిమెంట్ డే అని ఉదయం నుంచే చర్చలు పెడతారు. అలాగే ప్రతీ ఫలితాన్ని విశ్లేషిస్తారు. కానీ ఈసారి అలాంటిది ఏదీ లేకుండా పోయింది అంటే రిజల్ట్ అందరికీ ముందే తెలుసు కాబట్టి అని అంటున్నారు.

**ఇది మంచికేనా :**

ఈ తరహా రాజకీయం మంచికేనా అంటే దీని మీద కూడా భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. ద
రాజకీయం అంటే ఒకరు వేసే ఎత్తులకు మరొకరు పై ఎత్తు వేస్తారు అని అంటారు. అందువల్ల నాడు వైసీపీ అంతా తమదే అనుకుని చేసిన దానికి ఈ రోజు రీ సౌండ్ తో జవాబు వస్తోంది అని విశ్లేషించేవారు కూడా ఉన్నారు. అందుకే వైసీపీ సింపతీ కార్డు మద్దతు పెద్దగా వర్కౌట్ అవడం లేదని అంటున్నారు. అయితే రాజకీయాలు అయినా మరొకటి అయినా పోటీ ఉండాలి, ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం సమర్థంగా ఉండాలి. అలా ఉంటేనే ప్రగతి దారులు కనిపిస్తాయి. అంతా ఒకే పక్షం అయితే మజా ఉండదు, పైగా అది మంచిది కాదని అంటున్నారు. మరి అలాంటి వాతావరణం వస్తుందా అంటే వేచి చూడాల్సిందే అంటున్నారు విశ్లేషకులు.

# జెడ్పీ పీఠాల వాటాలు... కూటమిలో లెక్క సెట్ అయిందా ?



ఏపీలో 28 జిల్లా పరిషత్ చైర్మన్ పదవులను కూటమి పార్టీలు పంచుకోనున్నట్లు ప్రచారం జరుగుతోంది. వినిపిస్తున్న ఫార్ములా ప్రకారం టీడీపీకి 22, జనసేనకు 5, బీజేపీకి ఒక జెడ్పీ పీఠం దక్కనున్నాయట. జనసేనకు పల్నాడు, శ్రీ సత్యసాయి, అల్లూరి, శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాలు కేటాయించే అవకాశం ఉందని సమాచారం. కడప జెడ్పీ పీఠం బీజేపీకి ఇచ్చి, ఆదినారాయణరెడ్డి సూచించిన అభ్యర్థిని ఎంపిక చేయవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఏపీలో మొత్తం కొత్త జిల్లాలతో కలుపుకుని 28 జిల్లా పరిషత్తులు ఉన్నాయి. దాంతో జెడ్పీ చైర్మన్ పదవులు కూడా 28 దాకా పస్తాయి. ఇందులో కూటమి పార్టీలు అన్నింటా విజయబావుటా ఎగరేసే పరిస్థితులు ఉన్నాయని అంటున్నారు. దాంతో జెడ్పీ చైర్మన్ పదవులు ఎవరికి ఎన్ని అన్న చర్చ ఒక వైపు సాగుతోంది. దానికి ఒక ఫార్ములా సెట్ చేసి ఉంచారని అంటున్నారు. ఆ ప్రకారం కూటమిలో ముగ్గురు మిత్రులు పంచుకోవడానికి అవగాహన కుదిరింది అని అంటున్నారు.

**పెద్దన్నగా టీడీపీ :**

ఇక చూస్తే ఈ మొత్తం 28 జడ్పీ పీఠాలలో 22 దాకా టీడీపీ తీసుకుంటుంది అని చెబుతున్నారు. అలాగే రెండవ పెద్ద మిత్రపక్షంగా ఉన్న జనసేనకు 5 ఇస్తారని అంటున్నారు. బీజేపీకి కూడా ఒక జెడ్పీ పీఠం దక్కే పరిస్థితి ఉందని తెలుస్తోంది. ఈ మేరకు మిత్రులు అంతా సాఫీగా సజావుగానే జెడ్పీ పీఠాల పంపకాలను పూర్తి చేయాలని అనుకుంటున్నారు అని భోగట్టాగా ఉంది అని చెబుతున్నారు.

**జనసేనకు ఇవే :**

ఇక జనసేనకు దక్కే జెడ్ చైర్మన్ పదవులు ఇవే అంటూ ప్రస్తుతం ప్రచారం అయితే సాగుతోంది. అవి ఏవి అంటే పల్నాడు జిల్లాతో పాటు, శ్రీ సత్యసాయి, అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం తూర్పు గోదావరి జిల్లాలలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవులు జనసేనకు దక్కనున్నాయి. అలాగే, తిరుపతి జిల్లాలో జిల్లా పరిషత్ వైస్-చైర్‌పర్సన్ పదవి కూడా ఆ పార్టీకే లభించనుంది. అదే విధంగా మరిన్ని చోట్ల వైఎస్ చైర్మన్ పదవులు కూడా జనసేనకు ఇస్తారని అంటున్నారు.

**కడపలో కాషాయం :**

ఇక వైసీపీ అధినాయకత్వానికి సొంత జిల్లా అయిన కడప జడ్పీ పీఠం మీద బీజేపీ జెండా ఎగురుతుందని అంటున్నారు. ఎందుకంటే జమ్మలమడుగు ఎమ్మెల్యే బీజేపీకి చెందిన సీనియర్ నేత ఆదినారాయణరెడ్డి. ఆయన మొదటి నుంచి గట్టిగా పట్టు బట్టి ఉన్నారు. కడప పరిషత్తు ఎన్నికల్లో కూటమి బలాన్ని పెంచేందుకు ఆయన వంతు కృషి చేస్తున్నారు అని అంటున్నారు. దాంతో కడప జడ్పీ పీఠం కచ్చితంగా ఆదినారాయణ రెడ్డి చెప్పిన వారికే దక్కుతుందని అంటున్నారు. ఇక టీడీపీ సైతం ఈ కీలకమైన రాజకీయ స్థానంలో జాతీయ పార్టీగా బీజేపీకి చెందిన వారే ఉండడం విస్తృత రాజకీయ వ్యూహంలో భాగంగానే అని అంటున్నారు. టీడీపీ సైతం దీనికి సమ్మతించినట్లుగా చెబుతున్నారు.

**కొత్త చైర్మన్ ఆయనేనా :**

ఇక బీజేపీ బీజేపీ ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి సోదరుని కుమారుడు డాక్టర్ చాదిపిరాల రాజేష్ రెడ్డికి కడప జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పదవికి ఎంపిక చేస్తారు అని కూడా ఊహాగానాలు వినిపిస్తున్నాయ్. అదే సమయంలో టీడీపీకి చెందిన అనేక నాయకులు ఈ పదవి కోసం ఆశ పెట్టుకున్నారని అంటున్నారు. అయితే ఆదినారాయణ రెడ్డి మాట నెగ్గుతుందని అంటున్నారు. పరిషత్తు ఎన్నికల ఫలితాలు పూర్తిగా వచ్చిన తర్వాత ఒకసారి కూర్చుని దీని మీద కూటమి పార్టీలు క్లారిటీ ఇస్తాయని అంటున్నారు. ఏది ఏమైనా ఆఖరి నిముషంలో మార్పులు ఏవీ జరగకపోతే ఈ నంబర్లతోనే కూటమి మిత్రుల మధ్య జెడ్పీ పీఠాల పంపకం జరగవచ్చు అని అంటున్నారు. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# ఎన్నికల్లో విజయం.. ఎంపీటీసీ గెలుపు చూడకుండానే మరణం.. ఎంత దురదృష్టం..




తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం ధుమంతునిగూడెంలో జనసేన ఎంపీటీసీ అభ్యర్థి గారపాటి దివ్య మరణానంతరం విజయం సాధించారు. 28 ఏళ్ల దివ్య కౌంటింగ్‌కు ఒక్కరోజు ముందు గుండెపోటుతో కన్నుమూశారు. ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిపై 352 ఓట్ల మెజారిటీతో గెలిచారు. ఐదేళ్లు, మూడు నెలల వయసున్న ఇద్దరు పిల్లలను వదిలి ఆమె మరణించడంతో గ్రామంలో విషాదం నెలకొంది.

ఓట్లతో ప్రజలు పట్టం కట్టారు.. కానీ ఆ విజయాన్ని చూసే అదృష్టం మాత్రం ఆమెకు దక్కలేదు.. కౌంటింగ్‌కు ఒక్కరోజు ముందు గుండెపోటు రూపంలో మృత్యువు కబళించడంతో.. జనసేన ఎంపీటీసీ అభ్యర్థి గారపాటి దివ్య మరణానంతరం విజయం సాధించి అందరినీ కంటతడి పెట్టించారు. ఇద్దరు పసిబిడ్డలను అనాథలుగా మార్చి ఆమె అనంతలోకాలకు వెళ్లిన వైనం ధుమంతునిగూడెంలో తీరని విషాదాన్ని మిగిల్చింది.రాజకీయాల్లో గెలుపోటములు సర్వసాధారణం. ఎన్నికల్లో విజయం సాధిస్తే ఆ ఆనందాన్ని కుటుంబ సభ్యులతో.. గ్రామస్థులతో కలిసి పంచుకోవాలని ప్రతి అభ్యర్థి కలలుకంటారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలం ధుమంతునిగూడెంకు చెందిన జనసేన ఎంపీటీసీ అభ్యర్థి గారపాటి దివ్య విషయంలో విధి రాసిన రాత అత్యంత విషాదకరంగా మారింది. ప్రజల మనసులు గెలుచుకుని ఎన్నికల్లో ఘనవిజయం సాధించిన ఆమె.. తన విజయ వార్తను కనీసం చూసుకోకుండానే అనంతలోకాలకు వెళ్లిపోవడం అందరినీ కలచివేస్తోంది. బతికుండగా చూడలేని విజయాన్ని మరణానంతరం ఆమె సొంతం చేసుకోవడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది.జనసేన పార్టీ తరపున ఎంపీటీసీ బరిలోకి దిగిన 28 ఏళ్ల గారపాటి దివ్య.. ప్రత్యర్థి వైసీపీ అభ్యర్థిపై ఏకంగా 352 ఓట్ల భారీ మెజారిటీతో ఘనవిజయం సాధించారు. ఓట్లతో ప్రజలు ఆమెకు పట్టం కట్టారు. ప్రజాప్రతినిధిగా గెలిచి గ్రామ అభివృద్ధికి పాటుపడాలని ఆమె ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. కానీ ఫలితాలు వెలువడే క్షణానికి ఆమె ఈ లోకంలోనే లేరు. ఎన్నికల ఫలితాల కోసం గ్రామమంతా ఉత్కంఠగా ఎదురుచూస్తున్న వేళ.. కౌంటింగ్‌కు సరిగ్గా ఒక్కరోజు ముందే ఆమె తీవ్రమైన గుండెపోటుతో అకస్మాత్తుగా కన్నుమూశారు.

ఈ హృదయవిదారక ఘటన ఆమె కుటుంబాన్ని శోకసంద్రంలో ముంచెత్తింది. ప్రేమ వివాహం చేసుకున్న దివ్యకు ఐదేళ్లు, మూడు నెలల వయసున్న ఇద్దరు చిన్నారులు ఉన్నారు. పసిప్రాయంలో ఉన్న ఆ పిల్లలకు తల్లి లేని లోటు ఎప్పటికీ తీరనిది. తల్లి ఎన్నికల్లో గెలిచిందన్న గర్వం కంటే.. ఇక తమను లాలించే అమ్మ లేదన్న వాస్తవమే ఆ చిన్నారుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోంది. చిన్న వయసులోనే ఆ పసివాళ్లు అనాథలుగా మారడం స్థానికుల కంటతడి తెప్పిస్తోంది.ధుమంతునిగూడెం ప్రజలు దివ్యపై నమ్మకంతో భారీ మెజారిటీనిచ్చి గెలిపించారు. ఆమె ప్రజాసేవ చేస్తుందని ఆశించారు. కానీ ఆమె రాజకీయ ప్రయాణం మధ్యలోనే విషాదాంతమైంది. ఒకవైపు ఎన్నికల్లో గెలిచిన ప్రజాప్రతినిధిగా గుర్తింపు.. మరోవైపు ఆ విజయాన్ని ఆస్వాదించలేని దయనీయ స్థితి. రాజకీయ విజయాల వెనుక కొన్నిసార్లు ఇలాంటి కన్నీటి కథలు కూడా ఉంటాయని దివ్య మరణం కంటతడి పెట్టిస్తోంది. ఓట్ల లెక్కింపులో విజయం సాధించినా.. కాలంతో సాగిన పోరాటంలో ఆమె ఓడిపోయారు. దివ్య భౌతికంగా మన మధ్య లేకపోయినా ఆమె జ్ఞాపకాలు మరియు ఆ గ్రామం ఇచ్చిన తీర్పు ఎప్పటికీ చిరస్మరణీయమే.

## సంపాదకీయం


# సంక్షేమానికి ఓటరు కార్డు?

కేంద్ర పంచాయతీరాజ్ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ చేసిన ప్రకటన కొత్త వివాదానికి దారి తీసింది. తన శాఖ పథకాల కింద లబ్ధిదారులను గుర్తించడానికి, చెల్లింపులు చేయడానికి ఇకపై ఆధార్‌కు బదులు బయోమెట్రిక్ ధృవీకరణతో కూడిన ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్) నంబర్ ఆధారమవుతుందని ఆయన అన్నట్టు నివేదికల మాట. "ఎవరికైనా ఐదు నిమిషాల్లో ఆధార్ కార్డు తయారు చేయవచ్చు, కాబట్టి ఆధారే ప్రాతిపదిక కాదు" అనీ అన్నారు. వివాదం ముదిరాక, శుక్రవారం తన వీడియోలో ఆధార్‌తో పాటు బయోమెట్రిక్ ధృవీకరణ, ఎపిక్ నంబర్ కూడా చేర్చామని, ఆధార్ ఒక్కటే ఆధారం కాదని వివరణ ఇచ్చారు. కాంగ్రెస్ దీన్ని "ఓట్ల చోరీ ట్రైలర్ మాత్రమే, అసలు సినిమా హక్కుల చోరీ" అని విమర్శించింది; రాహుల్ గాంధీ దీన్ని ప్రభుత్వ "కుట్ర"గా అభివర్ణించారు; మంత్రి ఆయన్ను "అశాంతి ఆత్మ" అంటూ ఎదురుదాడి చేశారు. రెండు రకాల మాటలు వినిపించడంతో ఇది అధికారిక విధానమా, కాదా అన్న గందరగోళం మిగిలింది. ఇది ప్రస్తుత చట్టాలకు, నిబంధనలకు విరుద్ధం. అసలు విషయం ఏమిటంటే, ఎన్నికల సంఘం (ఈసీఐ) అనేక రాష్ట్రాల్లో నిర్వహించిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ద్వారా తయారైన ఓటర్ల జాబితా, లబ్ధిదారుల గుర్తింపును ధృవీకరించే సమాచార వనరుగా మారుతుంది. కానీ బిహార్ ఎస్ఐఆర్‌పై ఈ ఏడాది మే 27న ఇచ్చిన తీర్పులో సుప్రీంకోర్టు ఇంకో మాట చెప్పింది: జాబితాలో ఎవరుండాలో నిర్ణయించడానికి పౌరసత్వంపై ఈసీఐ "పరిమిత విచారణ" మాత్రమే చేయవచ్చు, దాని ఆధారంగా తీసుకునే ఏ చర్య అయినా "ఎన్నికల పరిణామాలకే" పరిమితం. జాబితా నుంచి తొలగిస్తే వచ్చే ఫలితం కూడా ఆ వ్యక్తి జాబితాలో స్థానానికి, ఓటు హక్కుకు మాత్రమే పరిమితమని పేర్కొంది. ఎపిక్‌ను కూడా కోర్టు "ఎన్నికల జాబితాలో చేర్చడం ఆధారంగా ఇచ్చే ఒక ఉత్పన్న పత్రం"గా పిలిచి, ఆ జాబితాను ధృవీకరించడానికే దాన్ని వాడితే ప్రక్రియ అర్థరహితమవుతుందని చెప్పింది. పశ్చిమ బెంగాల్‌లో ఎస్ఐఆర్‌లో తొలగించిన వారికి రేషన్ (ప్రజా పంపిణీ వ్యవస్థ), అన్నపూర్ణ యోజన నిలిపివేయడంపై పిటిషన్ల విచారణలో కూడా న్యాయమూర్తులు ఇదే మాటను గుర్తు చేశారు: ఓటరు జాబితాలో పేరు లేకపోయినా కొన్ని ప్రయోజనాలకు వ్యక్తి అర్హుడేనని ప్రధాన న్యాయమూర్తి అన్నారు; బిహార్ తీర్పు ఇదే స్పష్టం చేసిందని జస్టిస్ బాగ్చీ చెప్పారు. ఇలా సుప్రీంకోర్టు "ఉత్పన్న పత్రం" అని పిలిచిన కార్డునే ఇప్పుడు సంక్షేమ ప్రయోజనాలను నిర్ణయించే ఆధారం చేయాలనుకోవడం విరోధాభాసమే.

ప్రతి పౌరుడూ ఓటరు కాదు, ప్రతి ఓటరూ సంక్షేమ లబ్ధిదారుడూ కాదు. పిల్లలు, 18 ఏళ్లలోపు వారు, నమోదు కాని వారు ఓటరు జాబితాలో ఉండరు. కానీ వారికి పౌష్టికాహారం, ఆరోగ్యం, విద్య వంటి సంక్షేమం అవసరం. కాబట్టి సంక్షేమాన్ని ఓటరు జాబితాతో ముడిపెట్టడం అసంబద్ధం, క్రూరం కూడా. పైగా ఈ జాబితాల తయారీ ప్రక్రియలోనే లోపాలున్నాయి. పశ్చిమ బెంగాల్‌లో ముసాయిదా జాబితా నుంచి 58 లక్షలకు పైగా పేర్లు తొలగిపోయాయి; న్యాయాధికారుల విచారణ తర్వాత సుమారు 27 లక్షల మందిని అనర్హులుగా తేల్చారు, వారిలో చాలామందిని సందేహాస్పదమైన "తార్కిక వ్యత్యాసాల" పేరుతో గుర్తించారు. పునరుద్ధరణ కోసం విచారించిన అప్పీళ్లలో 2026 సెప్టెంబర్ నాటికి 93 శాతంలో పేర్లు తిరిగి జాబితాలో చేరాయని వెల్లడైన గణాంకాలు, ఎన్నికలకు ముందే భారీ ఎత్తున ఓటు హక్కు కోల్పోయారన్న అనుమానాన్ని పెంచుతున్నాయి. "తార్కిక వ్యత్యాసాల" పద్ధతి చట్టబద్ధతపై సుప్రీంకోర్టు ఇంకా తీర్పు చెప్పలేదు. అంతేకాదు, బెంగాల్ అప్పీళ్ల ట్రైబ్యునళ్ల న్యాయమూర్తులు, న్యాయ ఉత్తర్వులున్నా 'ఈసీఐనెట్' వ్యవస్థ తొలగించిన ఓటరును తిరిగి చేర్చలేకపోయిందని గమనించారు; గోవాలో విచారణల్లో అర్హులని తేలిన 97 మంది ఓటర్లను తుది జాబితాలో చేర్చలేకపోయారని నివేదికలు చెబుతున్నాయి. అంటే ఈ జాబితా తప్పులకు అతీతం కాదు. ఎస్ఐఆర్ రూపకల్పనే కఠినమైన నివాస ప్రమాణాల ద్వారా నమోదును పరిమితం చేసేలా ఉందన్న విమర్శ కూడా ఉంది; అందువల్ల పని కోసం ఊళ్లు మారే వలస కార్మికులు తమ అర్హతను రుజువు చేసుకోవాల్సి వచ్చింది. సంక్షేమం అత్యంత అవసరమైన వారిలో వీరే ఎక్కువ. అదనంగా, బయోమెట్రిక్ ధృవీకరణ కూడా నిర్దోషి కాదు: ఆధార్ బయోమెట్రిక్ విఫలమవడం వల్ల రేషన్, ఉపాధి హామీ వంటి పథకాల్లో అర్హులైన లబ్ధిదారులకు ప్రయోజనాలు ఆగిపోతున్నాయని పార్లమెంటరీ కమిటీ సభ్యులు పార్టీలకు అతీతంగా ఆందోళన వ్యక్తం చేశారు. ఓటరు జాబితా లోపాలకు, వేలిముద్రల లోపాలు తోడైతే, అర్హులు ఎక్కువ మంది తప్పిపోయే ప్రమాదం ఉంది.

ఈ వివాదం వెనుక రాజకీయం కూడా ఉంది. ఎస్ఐఆర్ లోపాలను ప్రతిపక్షాలు, పౌర సమాజం, ఎన్డీయే మిత్రపక్షాల్లో కొన్ని కూడా ప్రశ్నిస్తున్నాయి; బీజేపీ మాత్రం లోపాలున్నాయని అంగీకరించడం లేదు, ఈసీఐ కూడా జాబితాలను శుభ్రపరచడమే తమ ఉద్దేశమని చెబుతోంది. పేర్లు తొలగిన చోట్ల, బెంగాల్‌లో జరిగినట్టు, అధికార పక్షానికి లాభం కలిగిందన్నది విమర్శకుల ఆరోపణ. సంక్షేమాన్ని పరిమితం చేయడానికి కూడా ఈ కత్తిరించిన జాబితాలను ఉపయోగించుకునే ఆలోచన ఉందన్న అనుమానమూ వినిపిస్తోంది, ముఖ్యంగా కేంద్ర విధానాల వల్ల పన్ను ఆదాయ వృద్ధి మందగించిన ఈ సమయంలో. ప్రభుత్వం ఇలాంటి ఉద్దేశం ఉందని ఎక్కడా చెప్పలేదు, కానీ మంత్రి వ్యాఖ్యలు ఆ అనుమానాలకు ఆజ్యం పోశాయి. జనాభా లెక్కల (సెన్సస్) ఆలస్యం, ఎన్నికల కమిషనర్ల నియామక పద్ధతి మార్పు, ఆ కమిషన్ నడిపే ప్రక్రియ ద్వారా లక్షలాది మంది ఓటు హక్కు కోల్పోవడం, ఇప్పుడు అదే జాబితాతో సంక్షేమ లబ్ధిదారులను నిర్ణయించే ఆలోచన, ఇవన్నీ కలిసి దశాబ్దాలుగా కష్టపడి నిర్మించుకున్న రాజ్యాంగ సంక్షేమ రాజ్యం పునాదులను కదిలిస్తాయని విమర్శకులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి ప్రభుత్వం ముందుగా ఈ విషయంలో లిఖితపూర్వక స్పష్టత ఇవ్వాలి: ఎపిక్ ఆధారిత ధృవీకరణ తప్పనిసరా, ఐచ్ఛికమా; ఆధార్‌తో పాటు ప్రత్యామ్నాయ గుర్తింపు పత్రాలు, బయోమెట్రిక్ విఫలమైతే ఆఫ్‌లైన్ ధృవీకరణ మార్గాలు ఉంటాయా? ఓటరు జాబితా ఎవరు ఓటు వేయవచ్చో నిర్ణయిస్తుంది, ఎవరికి సంక్షేమం అవసరమో కాదు; ఈ రెండినీ వేరుగా ఉంచాలి. ఎస్ఐఆర్‌పై పెండింగ్‌లో ఉన్న పిటిషన్లపై సుప్రీంకోర్టు త్వరగా తీర్పు చెప్పి, ఈ జాబితాలను సంక్షేమాన్ని కత్తిరించడానికి వాడకూడదని మరోసారి స్పష్టంగా చెబితే ఎంతో మంచిది.

పనికొచ్చే పలుకు



# అప్పుడే.. అడుగు ముందుకుపడాలి!

జీవితంలో.. ప్రతి ప్రయత్నం ఒకేలా ఉండదు. కొన్ని పనులు అలవాటైపోయి.. చేయడానికి ఆలోచించాల్సిన అవసరం ఉండదు. కానీ ఎప్పుడైతే మనం మన పరిధిని దాటి కొత్తగా ఏదైనా ప్రయత్నించాలని అనుకుంటామో.. అప్పుడే మనసులో ఎన్నో ప్రశ్నలు. 'నేను చేయగలనా?', 'ఒకవేళ విఫలమైతే పరిస్థితి ఏమిటి?', 'ఇంతకాలం అనుసరించిన మార్గాన్ని వదిలి కొత్త దారిలో ప్రయాణించడం అవసరమా?' అంటూ సందేహాలు చుట్టుముడతాయి. ఒక్కోసారి మన సామర్థ్యంపై మనకే నమ్మకం తగ్గిపోతుంది. అయితే ఇక్కడ ఒక విషయం గుర్తుంచుకోవాలి. మీపై మీకు అనుమానం కలిగినంత మాత్రాన మీరు అసమర్థులు అయిపోరు. కొత్త అవకాశాల వైపు అడుగులు వేస్తున్నప్పుడు కలిగే సహజమైన మానసిక సంఘర్షణ అది. చిన్న ఉదాహరణ తీసుకుందాం. ఇప్పటివరకు సైకిల్ మాత్రమే తొక్కిన వ్యక్తి మొదటిసారి మోటార్ సైకిల్ నడపాలని అనుకున్నాడనుకోండి. అతడికి భయం కలగడం సహజం. బ్యాలెన్స్ తప్పుతుందేమో, ప్రమాదం జరుగుతుందేమో అనే ఆలోచనలు వస్తాయి. కానీ ఆ భయంతో ప్రయత్నించడమే మానేస్తే.. అతడు ఎప్పటికీ సైకిల్‌కే పరిమితమవుతాడు. అదే ధైర్యంగా నేర్చుకోవడం మొదలుపెడితే.. కొంతకాలానికి మోటార్ సైకిల్ నడపడం అతడికి అలవాటైపోతుంది. జీవితంలో ఎదుగుదల కూడా ఇంతే. కొత్తగా నేర్చుకునే ప్రతి నైపుణ్యం, తీసుకునే ప్రతి నిర్ణయం తొలుత అసౌకర్యమే. కానీ అదే మనల్ని మరోస్థాయికి తీసుకెళ్తుంది.

నిజానికి మనిషి జీవితంలో ఎదుగుదలకు అతిపెద్ద అడ్డంకి అపజయం కాదు.. అది వస్తుందనే భయం. చాలామంది తమకున్న సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో ఉపయోగించుకోలేకపోవడానికి కారణం అవకాశాలు లేకపోవడం కాదు. తగినంత నమ్మకం లేకపోవడమే! ఇతరులు ఏమనుకుంటారో, తాము అనుకున్నది సాధించలేకపోతే అవమానంగా ఉంటుందేమోనని ఆలోచిస్తూ మొదటి అడుగే వేయరు. ఫలితంగా మార్పు కావాలనే కోరిక ఉంటుంది కానీ, ఆ మార్పు కోసం అవసరమైన ప్రయత్నం మాత్రం ఉండదు. అందుకే మీ జీవనశైలిని మార్చుకోవాలనుకుంటే ముందుగా మీ ఆలోచనా విధానాన్ని మార్చుకోండి. ఒకేసారి పెద్ద లక్ష్యాలను చేరుకోవాలని ఒత్తిడి తెచ్చుకోకండి. చిన్న చిన్న మార్పులతో ప్రారంభించండి. కొత్త అలవాట్లను అలవరచుకోండి. ప్రతిరోజూ కొంత సమయాన్ని మీ అభివృద్ధికి కేటాయించండి. నిన్నటి మీతో నేటి మిమ్మల్ని పోల్చుకోండి. ఇతరుల విజయాలను చూసి మీ ప్రయాణాన్ని తక్కువగా అంచనా వేయకండి. ఒక్కోసారి వెనకడుగు పడినా, అనుకున్న ఫలితం రాకపోయినా దాన్ని మీ అసమర్థతకు నిదర్శనంగా భావించకండి. ఎక్కడ పొరపాటు జరిగిందో తెలుసుకుని మరోసారి ప్రయత్నించండి.

ముఖ్యంగా ఒక విషయం గుర్తుంచుకోండి. ఆత్మవిశ్వాసం అంటే మనం చేసే ప్రతి పనిలో విజయం సాధిస్తామనే గుడ్డి నమ్మకం కాదు. విఫలమైనా తిరిగి ప్రయత్నించగలమనే ధైర్యం. భయం లేకపోవడమే ధైర్యం కాదు.. భయం ఉన్నప్పటికీ ముందుకు సాగడమే అసలైన ధైర్యం. మీలోని సామర్థ్యాన్ని మీరు గుర్తించాలంటే ముందుగా మీకు మీరే అవకాశమివ్వాలి.

సో, మీపై మీకు అనుమానం కలిగితే వెనక్కి తగ్గకండి. ఆ సందేహాన్ని మీ ఎదుగుదలకు ఒక పరీక్షగా భావించండి. ఎందుకంటే మీరు ఇప్పటివరకు చేయని పనిని ప్రయత్నిస్తున్నారంటే.. మీ పాత పరిమితులను దాటి కొత్త వ్యక్తిగా మారేందుకు సిద్ధమవుతున్నారనే అర్థం. గుర్తుంచుకోండి.. మీలోని శక్తి మీకు తెలియాలంటే, మీరు ప్రయత్నించడం మొదలుపెట్టాలి. మీపై మీకు నమ్మకం కలిగిన రోజే మీ జీవితంలో నిజమైన మార్పు మొదలవుతుంది!

# ఒక పండుగ.. వంద కథలు!



భారతీయ క్యాలెండర్‌లో దీపావళిలా దేశమంతా జరుపుకునే పండుగలు తక్కువ. ఆచరణలో ఇంతగా రూపం మార్చుకునేవి మరీ తక్కువ. అమృత్‌సర్ నుంచి మదురై వరకు, కోల్‌కతా నుంచి సూరత్ వరకు పేరు దాదాపు ఒకటే, కానీ పూజించే దేవుళ్లు, చెప్పుకునే కథలు, చేసే ఆచారాలు ప్రాంతాన్ని బట్టి మారతాయి. అందుకే దీపావళి ఒక్క మత కార్యక్రమం కాదు, ఒక సామాజిక వ్యవస్థ; భారతీయులు గతాన్ని ఎలా గుర్తుచేసుకుంటారో, బంధాలను ఎలా నిలబెట్టుకుంటారో, మార్పును ఎలా స్వీకరిస్తారో అది చూపిస్తుంది. ఉత్తరాదిలో పధ్నాలుగేళ్ల వనవాసం తర్వాత రావణుడిని ఓడించి శ్రీరాముడు అయోధ్యకు తిరిగి రావడాన్ని దీపాలతో జరుపుకుంటారు. ఆ వేడుక ఐదు రోజులు సాగుతుంది: ధన్‌తేరస్‌తో కొనుగోళ్లు, నరక చతుర్దశి, సంపద-జ్ఞానం కోసం లక్ష్మీ-గణేశ పూజ, ప్రకృతి-వ్యవసాయాన్ని స్మరించే గోవర్ధన పూజ, చివరగా అన్నదమ్ములు-అక్కచెల్లెళ్ల బంధాన్ని గౌరవించే భాయ్ దూజ్. అంటే విశ్వాసం, ఆర్థికం, పర్యావరణం, బంధుత్వం ఒకే వారంలో కలుస్తాయి. దక్షిణాదిలో ప్రాధాన్యం మారుతుంది. తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో శ్రీకృష్ణుడు నరకాసురుడిని సంహరించిన కథ మూలం; ఆ రోజు తెల్లవారుజామునే తలంటు స్నానం, కొత్త బట్టలు, పండుగ వంటకాలతో మొదలవుతుంది; కొన్ని ప్రాంతాల్లో బలి పాడ్యమి కూడా జరుపుకుంటారు.


ఈ ఏడాది దక్షిణాదిలో నరక చతుర్దశి ఘడియలు ఆదివారం (నవంబర్ 8) ఉదయం 11.28 వరకు ఉండటంతో, తలంటు స్నానం, దీపావళి లక్ష్మీ పూజ రెండూ అదే రోజున వస్తున్నాయి. తూర్పున అదే రాత్రి కాళీ మాతది; పశ్చిమ బెంగాల్, అస్సాం, ఒడిశాల్లో ఆమెను పూజిస్తారు. ఒడిశాలో 'బడబడువా దాకా' అనే ఆత్మీయ ఆచారం ఉంది: కుటుంబాలు 'కౌన్రియా కాఠీ' కాల్చి పితృదేవతల ఆశీస్సులు కోరతాయి. పశ్చిమ భారతంలో పండుగకు వాణిజ్య రంగు: గుజరాతీ వ్యాపారులు 'చోప్డా పూజన్'తో కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభిస్తూ లెక్కల పుస్తకాలను దేవుడి ముందు పెడతారు; మహారాష్ట్రలో బలి ప్రతిపద, భావు బీజ్ ఉన్నాయి. హిందూ మతం వెలుపల సిక్కులు గురు హరగోబింద్ సాహిబ్ విడుదలను 'బందీ ఛోడ్ దివస్'గా, జైనులు మహావీరుడి నిర్వాణాన్ని స్మరిస్తారు. ఏ ఒక్క కథ ఈ పండుగకు యజమాని కాదు; ప్రతి సమాజం తన జ్ఞాపకం, అనుభవంతో దీన్ని తీర్చిదిద్దుకుంది.

ఈ పండుగ అసలు పని పూజా గది బయటే జరుగుతుందేమో. పొరుగువారికి తీసుకెళ్లే మిఠాయి పెట్టె, సహోద్యోగులతో పంచుకునే ప్లేటు, చెప్పకుండా చేసే బంధువుల సందర్శన, ఈ చిన్న చేష్టలు గణనీయమైన సామాజిక పని చేస్తాయి. సామాజిక శాస్త్రవేత్తలు దీన్ని 'సామాజిక పెట్టుబడి' నిర్మాణం అంటారు: సమాజాలు పనిచేయడానికి అవసరమైన నమ్మకం, పరస్పర సహకారం. సహోద్యోగులకు స్వీట్లు ఇవ్వడం కార్యాలయంలో ఉన్నత-నిమ్న భేదాలను కొద్దిసేపైనా మెత్తబరుస్తుంది; పండుగ సందర్శన ఎవరూ ముందు క్షమాపణ చెప్పకుండానే గొడవను ముగించే గౌరవప్రదమైన మార్గం. వృత్తులు, షెడ్యూళ్లు, వ్యక్తిగత ఆశయాల చుట్టూ తిరిగే సమాజంలో ఇలా మళ్లీ కలవడానికి ఆచారబద్ధమైన సాకులు మరింత అవసరం. మిఠాయి అనుషంగికం మాత్రమే; మారేది గుర్తింపు. డిజిటల్ మాధ్యమం కొత్త పొరను చేర్చింది. ఆచార జ్ఞానం ఒకప్పుడు తాతయ్యలు, కుటుంబ పురోహితులు, పంచాంగాల ద్వారా వచ్చేది; ఇప్పుడు చాలా ఇళ్లు యూట్యూబ్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వైపు చూస్తున్నాయి. పండితులు, జ్యోతిష్కులు, గురువులు, స్వయం ప్రకటిత నిపుణులు ఈ వేదికలపై ముహూర్తాలు, పరిహారాలు, పురాణ ఉల్లేఖనలతో నిండిపోతున్నారు. ఆధునికత మత విశ్వాసాన్ని కరిగిస్తుందన్న పాత అంచనాను ఇది తలకిందులు చేస్తుంది; సాంకేతికత విశ్వాసానికి కొత్త మార్గమైంది. ఈ ఏడాదే ఉదాహరణ: దీపావళి 8వ తేదీనా, 9వ తేదీనా అనే సందేహం ఆన్‌లైన్‌లో పెద్ద చర్చగా మారింది; నగరాన్ని బట్టి ముహూర్తాలు మారతాయని (ఢిల్లీలో లక్ష్మీ పూజ సాయంత్రం 5.54 నుంచి 7.50 వరకు) తెలియనివారు గందరగోళపడ్డారు. కెమెరా ఉన్న ప్రతి ఒక్కరూ శాస్త్రాధికారం ప్రకటించుకునే చోట, జ్ఞానానికి, అమ్మకపు మాటలకు తేడా గుర్తించడం కష్టం. ఎవరి వ్యాఖ్యానం చెల్లుతుంది, ఎవరు ధృవీకరించారు, ఎవరికి లాభం అన్న ప్రశ్నలను ఈ ధార్మిక మార్కెట్ ఇక తప్పించుకోలేదు.

పాత-కొత్తల సర్దుబాటు డాబాలపైన, బాల్కనీల్లోనూ కనిపిస్తుంది. అవనూనె ప్రమిద ఇప్పుడు ఎల్ఈడీ తీగలు, ప్రోగ్రామబుల్ డిన్‌ప్లేలు, చౌకైన చైనా లైట్లతో స్థలం పంచుకుంటోంది. ఇవి చౌకగా దొరకడం వల్ల అలంకరణ ఇక సంపన్నులకే పరిమితం కాదు. దీన్ని ఆధ్యాత్మిక క్షీణతగా చూడటం పొరపాటు: విద్యుత్ దీపాలు వేలాడదీసిన కుటుంబమూ లక్ష్మీ-గణేశ పూజకు కూర్చుంటుంది, పొరుగువారితో శుభాకాంక్షలు పంచుకుంటుంది; కొత్త అభిరుచులను, సాంకేతికతలను స్వీకరించగలగడం వల్లే సంప్రదాయాలు బతికి ఉంటాయి. అసలు ఖర్చు వేరే చోట ఉంది: పెరిగే విద్యుత్ వినియోగం, దశాబ్దాల పాటు మిగిలిపోయే ప్లాస్టిక్ అలంకరణలు, టపాసుల పొగ. ఈ సీజన్‌లో ఢిల్లీ గాలి 'చాలా దారుణ' నుంచి 'తీవ్ర' స్థాయికి చేరుతుండగా, సుప్రీంకోర్టు సర్టిఫైడ్ గ్రీన్ టపాసులను నవంబర్ 7-8 తేదీల్లో, పరిమిత సమయాల్లో మాత్రమే అనుమతించింది; ఇలాంటి ఆంక్షలు పండుగ ఆనందాన్ని తగ్గించడానికి కాదు, తర్వాతి రోజుల్లో శ్వాసించే ఆరోగ్యాన్ని కాపాడటానికి. కాబట్టి దీపావళి ఆచరణలో స్థిరత్వానికి చోటు ఉండాలి. ఈ దారాలన్నీ కలిపి చూస్తే దీపావళిని ఒకే వర్ణనలో ఇమడ్చలేమని అర్థమవుతుంది. రాముడి రాక, కృష్ణుడి విజయం, కాళీ శక్తి, పితృ స్మరణ, కొత్త లెక్కల పుస్తకం, ఇవి ఒకే పండుగపై పోటీ పడే వాదనలు కావు; అనేక అర్థాలను ఒకేసారి మోయగల ఆత్మవిశ్వాసం ఉన్న సంస్కృతికి సాక్ష్యాలు.

ఆ సారం చివరికి సామాజికమైనది. చీకటిపై వెలుగు గెలవాలన్న సందేశం దీపావళి చెప్పే దానిలో సగమే. మిగిలిన సగం గుమ్మానికి ఇరువైపులా ఉన్న మనుషుల గురించి: దూరమైన బంధువు, పరిచయం లేని పొరుగువాడు, హోదాతోనే తెలిసిన సహోద్యోగి. ప్రమిదలు కొద్ది రోజుల్లో ఆరిపోతాయి, అలంకరణలు దించేస్తారు. కానీ అవగాహన, కరుణ, పరస్పర గౌరవం, సయోధ్య అనే వెలుగులు ఐదు రోజుల వేడుక తర్వాత కూడా నిలవాలి; ఏ సమాజమైనా పండుగను ఎంత బాగా పాటించిందో వాటితోనే కొలవాలి.

ఈ ఏడాది కొన్ని చిన్న నిర్ణయాలు చాలు: పాత మాటల తేదీను మిఠాయితో ముగించడం, పొరుగువారిని పలకరించడం, మట్టి ప్రమిదలు ఎక్కువగా వాడటం, టపాసులు తగ్గించడం లేదా గ్రీన్ టపాసులకే పరిమితమవ్వడం, ఆన్‌లైన్ ముహూర్తాలు, పరిహారాలు నమ్మేముందు ఎవరు చెప్పారో చూడటం. అప్పుడు పండుగ ముగిశాక కూడా ఇంటి గుమ్మం, మనసు రెండూ వెలుగుతూనే ఉంటాయి. ■



జీవితంలో ఏదీ శాశ్వతం కాదు. ఈ రోజు మనల్ని కుంగదీసే కష్టాలు రేపు కనుమరుగవుతాయి. ప్రస్తుతం ఎదురవుతున్న పరిస్థితులు కూడా ఎప్పటికీ ఇలాగే ఉండవు. కాలం మారుతుంది.. పరిస్థితులు మారతాయి.. మనుషులు వస్తుంటారు, వెళ్తుంటారు. కొందరు ఆనందాన్ని పంచితే, మరికొందరు ఎన్నో పాఠాలు నేర్పిస్తారు. అందుకే జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులకు కుంగిపోకండి. ఎంతటి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నా మీ మీద మీరు నమ్మకం కోల్పోవద్దు. ఎందుకంటే ప్రతి చీకటి వెనుక ఓ వెలుగు ఉంటుంది. గుర్తుంచుకోండి.. ఇప్పుడు మీరు ఎదుర్కొంటున్నది మీ జీవిత కథలో ఒక చిన్న అధ్యాయం మాత్రమే. అది మీ ప్రయాణానికి ముగింపు కాదు.. మరో అందమైన ఆరంభానికి పునాది కావచ్చు!

-మహాదేవ

వింతల్లో వింతలు

## ఆమె అరుపువింటే.. అంతే సంగతులు!



సాధారణంగా పక్కింటి వాళ్ల అరుపులకే తట్టుకోలేకపోతుంటాం. అలాంటిది ఈ బామ్మగారి గొంతు వింటే ఏకంగా ఊరంతా ఉలిక్కిపడాల్సిందే! బ్రిటన్‌కు చెందిన 68 ఏళ్ల బ్రెండా విలిసన్ తన అరుపుతో ప్రపంచంలోనే అత్యంత బిగ్గరగా అరిచే మహిళగా గిన్నిస్ రికార్డు సృష్టించారు. ఆమె 'ఓయేజ్' అంటూ చేసిన ఒక్క అరుపు ఏకంగా 105.9 డెసిబుల్స్ నమోదైంది. 1987 నుంచి టౌన్ క్రయర్‌గా పనిచేస్తున్న ఆమెకు ఇది కొత్తేమీ కాదట! అంతేకాదు.. ఆ రోజు జలుబుతో బాధపడుతున్నానని, ఇంకా గట్టిగా అరిచే సత్తా తనకుందని చెప్పడం అసలు ట్విస్ట్!

# కివీస్ ఆశలపై వర్షం నీళ్లు..

## డీఎల్ఎస్‌తో భారత్‌కు సిరీస్‌లో రెండో విజయం!

**న్యూజిలాండ్‌పై భారత్‌కు 4 పరుగుల తేడాతో విజయం**

**డీఎల్ఎస్ పద్ధతిలో ఫలితం తేల్చిన వర్షం**

**కివీస్‌ను 134 పరుగులకే కట్టడి చేసిన భారత బౌలర్లు**

**గుర్నూర్ బ్రార్ నాలుగు వికెట్లతో మెరుపు ప్రదర్శన**

**ఐదు వన్డేల సిరీస్‌లో 2-0తో ఆధిక్యంలో భారత్**



వర్షం.. వికెట్ల పతనం.. ఉత్కంఠభరిత పోరు! చివరకు డక్‌వర్త్ లూయిస్ (డీఎల్ఎస్) పద్ధతిలో భారత్ విజయం సాధించింది. న్యూజిలాండ్‌తో వెల్లింగ్టన్‌లో శనివారం జరిగిన రెండో వన్డేలో టీమిండియా 4 పరుగుల తేడాతో గెలిచింది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో 2-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. తొలుత భారత బౌలర్లు అదరగొట్టి కివీస్‌ను 134 పరుగులకే కట్టడి చేశారు. లక్ష్య ఛేదనలో భారత బ్యాటర్లు తడబడినా.. చివర్లో వర్షం రావడంతో డీఎల్ఎస్ పద్ధతి భారత్‌కు విజయాన్ని అందించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌ను భారత పేసర్లు ఆరంభంలోనే దెబ్బతీశారు. అఖిబ్ నబీ రెండు వికెట్లు తీసి కివీస్‌ను ఒత్తిడిలోకి నెట్టాడు. అన్షుల్ కాంబోజ్ కూడా రెండు వికెట్లు పడగొట్టాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా డారిల్ మిచెల్ మాత్రం పట్టుదలగా ఆడాడు. 104 బంతుల్లో 55 పరుగులు చేసి జట్టుకు గౌరవప్రదమైన స్కోరు అందించే ప్రయత్నం చేశాడు. గ్లెన్ ఫిలిప్స్, టామ్ లాథమ్ ఎక్కువసేపు నిలవలేకపోయారు. కెప్టెన్ మిచెల్ సాంట్నర్ 31 పరుగులతో రాణించాడు. చివరకు 41 ఓవర్లలో కివీస్ 134 పరుగులకు ఆలౌటైంది. గుర్నూర్ బ్రార్ నాలుగు వికెట్లతో సత్తాచాటగా.. అఖిబ్ నబీ, అన్షుల్ కాంబోజ్, అక్షర్ పటేల్ రెండేసి వికెట్లు తీశారు. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆదిలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ గోల్డెన్ డక్‌గా వెనుదిరగగా.. విరాట్ కోహ్లీ 7 పరుగులకే ఔటయ్యాడు. రోహిత్ శర్మ 23, శ్రేయస్ అయ్యర్ 30 పరుగులు చేసి ఆదుకునే ప్రయత్నం చేశారు. అయితే క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోవడంతో భారత్ కష్టాల్లో పడింది. కేఎల్ రాహుల్ 26 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. 26 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 113 పరుగులు చేసిన సమయంలో వర్షం మొదలైంది. ఎంతసేపటికీ ఆట తిరిగి ప్రారంభం కాకపోవడంతో మ్యాచ్‌ను రద్దు చేశారు. డీఎల్ఎస్ లెక్కల ప్రకారం భారత్ 4 పరుగుల తేడాతో విజేతగా నిలిచింది. చివరి వరకు పోరాడిన కివీస్‌కు నిరాశే ఎదురైంది.

### కివీస్‌పై 'కింగ్' కోహ్లీ..

### పాంటింగ్ ప్రపంచ రికార్డు బద్ధలు!



టీమిండియా స్టార్ బ్యాటర్, రన్ మెషీన్ విరాట్ కోహ్లీ మరో ప్రపంచ రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. వెల్లింగ్టన్‌లోని సెల్లో బేసిన్ రిజర్వ్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన రెండో వన్డేలో, ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్‌ను అధిగమించి కివీస్‌పై వన్డేల్లో అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా చరిత్ర సృష్టించాడు. ఈ మ్యాచ్‌లో 135 పరుగుల లక్ష్య ఛేదనలో కోహ్లీ 7 పరుగులు మాత్రమే చేసినప్పటికీ, ఈ అరుదైన ఘనతను అందుకున్నాడు. ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు కోహ్లీ, పాంటింగ్ ఇద్దరూ న్యూజిలాండ్‌పై 1,971 పరుగులతో సమంగా ఉన్నారు. తాను ఎదుర్కొన్న రెండో బంతికే బౌండరీ బాదిన కోహ్లీ, పాంటింగ్‌ను వెనక్కి నెట్టి అగ్రస్థానానికి దూసుకెళ్లాడు. ఆస్ట్రేలియా దిగ్గజం రికీ పాంటింగ్ ఈ మైలురాయిని 51 మ్యాచ్‌ల్లోని 50 ఇన్నింగ్స్‌లలో చేరుకోగా, విరాట్ కోహ్లీ కేవలం 38 ఇన్నింగ్స్‌లలోనే ఈ ఘనత సాధించడం విశేషం. పాంటింగ్ కివీస్‌పై 45.83 సగటుతో 6 సెంచరీలు, 12 అర్ధ సెంచరీలు నమోదు చేశాడు. ప్రస్తుతం కోహ్లీ 1,978 పరుగులతో ఈ జాబితాలో మొదటి స్థానంలో ఉన్నాడు. ఈ సిరీస్‌లో ఇంకా మూడు మ్యాచ్‌లు మిగిలి ఉన్న నేపథ్యంలో న్యూజిలాండ్‌పై 2,000 వన్డే పరుగులు పూర్తి చేసిన తొలి ఆటగాడిగా నిలిచే సువర్ణావకాశం కోహ్లీ ముందుంది. కివీస్‌పై అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో కోహ్లీ, పాంటింగ్ తర్వాత సచిన్ టెండూల్కర్ (1,750), కుమార్ సంగక్కర (1,568), సనత్ జయసూర్య (1,519) తర్వాతి స్థానాల్లో ఉన్నారు. కాగా, ఈ మ్యాచ్‌లో కోహ్లీ ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయాడు.

## స్పోర్ట్స్

### రెండో వన్డేలో బ్యాటర్ల కష్టాలు..

### పిచ్‌పై కివీస్ స్టార్ బ్యాటర్ ఆసక్తికర వ్యాఖ్యలు



భారత్‌తో రెండో వన్డేలో న్యూజిలాండ్ బ్యాటర్లు పరుగులు చేయడానికి తీవ్రంగా ఇబ్బందిపడ్డారు. వెల్లింగ్టన్ పిచ్‌పై బంతి అనూహ్యంగా బౌన్స్ అవుతోందని కివీస్ బ్యాటర్ డారిల్ మిచెల్ తెలిపాడు. ఎప్పుడు ఎంత ఎత్తులో వస్తుందో అంచనా వేయలేకపోయామని చెప్పాడు. ఈ మ్యాచ్‌లో న్యూజిలాండ్ 134 పరుగులకే కుప్పకూలింది. రెండో ఇన్నింగ్స్‌లో భారత బ్యాటర్లు సైతం ఆచితూచి ఆడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పరిస్థితులకు తగ్గట్టుగా ఆడేందుకు ప్రయత్నించామని, అయినా ఆశించిన స్కోరు సాధించలేకపోయామని మ్యాచ్ అనంతరం బ్రాడ్‌కాస్టర్లతో మాట్లాడుతూ మిచెల్ వివరించాడు. పరుగులు చేయడానికి గ్యాప్‌లు వెతకడం, సింగిల్స్ తీయడం కూడా కష్టంగా మారిందని మిచెల్ తెలిపాడు. డ్రాప్ ఇన్ పిచ్ కావడంతో బంతి బ్యాట్‌కు తగిలిన తర్వాత వేగంగా ఫీల్డర్లను దాటడం లేదని చెప్పాడు. దీంతో స్ట్రైక్ రొటేట్ చేయడం మరింత కష్టమైందని వివరించాడు. న్యూజిలాండ్ 53 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయిన సమయంలో మిచెల్, శాంట్నర్ జట్టును ఆదుకున్నారు. ఆరో వికెట్‌కు 59 పరుగులు జోడించారు. మిచెల్ 104 బంతుల్లో 55 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అయితే కీలక భాగస్వామ్యాలు నెలకొల్పిన ప్రతిసారీ వికెట్లు కోల్పోవడం జట్టుకు ఇబ్బందిగా మారిందని చెప్పాడు. 134 పరుగుల లక్ష్యం తక్కువేనని మిచెల్ అంగీకరించాడు. అయినప్పటికీ భారత బ్యాటింగ్ ఆర్డర్‌లో తొలి వికెట్లు త్వరగా పడగొడితే మ్యాచ్‌లో అవకాశాలు ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశాడు. మిడిల్ ఆర్డర్‌ను ఒత్తిడిలోకి నెట్టగలిగితే ఏదైనా జరగొచ్చని పేర్కొన్నాడు.

# రెబల్ లుక్ లో హుమా ఖురేషి.. కుర్రాళ్లు ఏమైపోవాలి?

ఈ మధ్యకాలంలో సెలబ్రిటీలు ఒకవైపు సినిమా షూటింగ్లో బిజీగా ఉంటూనే.. మరొకవైపు గ్లామర్ తో కట్టిపడేస్తున్న విషయం తెలిసిందే. నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్గా ఉంటూ రోజుకో ఫోటోషూట్ తో అభిమానులను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నారు.ఇలా ఊహించని పాపులారిటీ సొంతం చేసుకున్న ఎంతో మంది సెలబ్రిటీలు ప్రముఖ మ్యాగజైన్ కవర్ పేజీలపై కూడా దర్శనం ఇస్తూ మరింత క్రేజ్ దక్కించుకుంటున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రముఖ బాలీవుడ్ బ్యూటీగా మంచి పేరు సొంతం చేసుకున్న హుమా ఖురేషి తాజాగా తన అధికారిక ఇన్స్టాగ్రామ్ ఖాతా ద్వారా షేర్ చేసిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ గా మారుతున్నాయి. జీక్యూ ఇండియా హీరోస్ మ్యాగజైన్ కోసం ఇచ్చిన ఫోజులలో ఈమె రెబల్ లుక్ చూసి కుర్రాళ్ళు సైతం భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రముఖ ఫ్యాషన్ బ్రాండ్ ఫీబీ ఫిలో రూపొందించిన ఓవర్ సైజ్డ్ బ్లాక్ లెదర్ జాకెట్ ధరించిన ఈమె దీనికి కాంబినేషన్లో వార్డుబోర్డు ఎన్. వై.సీ.బ్రాండ్ కు చెందిన సింపుల్ అండ్ స్లీక్ లెగ్గింగ్ ధరించింది. ఈ అవుట్ ఫిట్ కి తగ్గట్టుగా అవుట్ హౌస్ జువెలరీ కలెక్షన్ నుండి వచ్చిన ఇండస్ట్రియల్ స్టైల్ మెటల్ లింక్ లాంగ్ నెక్లెస్ ధరించి తన మేకోవర్ను ఫుల్ ఫీల్ చేసుకుంది.ముఖ్యంగా జీ క్యు ఇండియా హీరోస్ ఫోటోలకు సంబంధించిన ఈ బోల్డ్ అండ్ స్టైలిష్ లుక్ సోషల్ మీడియాలో తెగ వైరల్ గా మారింది. మొత్తానికైతే హుమా లుక్ చూసిన నెటిజన్స్ ఈ రేంజ్ లో అందాలు ఆరబోస్తే కుర్రాళ్ళు ఏమైపోవాలి అంటూ సరదాగా కామెంట్లు చేస్తున్నారు. ఏది ఏమైనా అమ్మడి అందం సోషల్ మీడియాలో తెగ వైరల్ గా మారింది.ప్రముఖ బాలీవుడ్ నటిగా పేరు దక్కించుకున్న ఈమె ఇండస్ట్రీలోకి రాకముందు మోడల్ గా తన కెరీర్ మొదలుపెట్టింది. 2012లో 'గ్యాంగ్స్ ఆఫ్ వాస్సేపూర్' అనే చిత్రం ద్వారా సినీ రంగంలోకి అడుగుపెట్టిన ఈమె.. హిందీతో పాటు తమిళ్,మరాఠీ, కన్నడ సినిమాలలో కూడా నటించి ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఇకపోతే చివరిగా కన్నడ సినీ నటుడు యశ్ హీరోగా మలయాళ డైరెక్టర్ గీతూ మోహన్దాస్ దర్శకత్వంలో వచ్చిన కన్నడ - ఇంగ్లీషు ద్విభాష చిత్రమైన టాక్సిక్ లో ఎలిజబెత్ అనే విలన్ పాత్ర పోషించింది. ఆగస్టు 26న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా అనుకున్నంత స్థాయిలో ఆకట్టుకోలేదు.ఇందులో హుమా ఖురేషి తో పాటు నయనతార , కియారా అద్వానీ, రుక్మిణి వసంత్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. 1940 నాటి గోవా నేపథ్యంలో సాగే భారీ బడ్జెట్ గ్యాంగ్స్టర్ డ్రామాగా ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా ఆడియన్స్ ను ఆకట్టుకోవడంలో విఫలమయ్యింది. దీనికి తోడు హిందీలో పూజ మేరీ జాన్ అనే చిత్రంలో కూడా నటించింది. ఏది ఏమైనా ఒకవైపు వరుస సినిమాలలో నటిస్తూ.. మరొకవైపు ఇలా గ్లామర్ అందాలు ఆరబోస్తూ అభిమానులకు మరింత చేరువ అవుతోంది.





**అద్భుతమైన ఎరుపు రంగు ఫ్యాషన్ లుక్‌తో ఆకర్షిస్తున్న అతుల్య రవి**



**బార్బీ తరహా గులాబీ రంగు దుస్తుల్లో మెరిసిపోతున్న గేహ్నా సిప్పీ**

PENSATTA TELUGU DAILY Printed, Published, Owned by CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 ,Publishe at D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 . And Printed at Chaitanya Vaaradhi printers, Do.No 2-99 Bharanikam, Paravada Anakapalli, Visakhapatnam- 531 021. Editor: CHITAMANENI ANIL KUMAR, D.NO 1-1, RAJULA ILLA PAKKANA, VENKATAPURAM, THANAM POST, MUNGAPAKA MANDAL, ANAKAPALLI VISHAKAPATNAM, ANDHRA PRADESH 531021 , Cell: 99853 15759, RNI. No APTEL/2023/87729, E-mail:anilchinthamneni@gmail.com